

యథాస్థానాలకు

తహసీల్దార్లు

- నేడో,రేపో పోస్టింగ్
- గతంలో పనిచేసిన డివిజన్‌లో నోచాన్స్
- అనువైన చోటు కోసం పెద్దఎత్తున సిఫార్సులు



తహసీల్దార్లకు స్థానచలనం -వార్త

నెల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ పోస్టింగ్‌ల ప్రక్రియ మొదలైంది. ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన 42 మంది తహసీల్దార్లు అక్కడి నుంచి రిలీవ్ అయి సొంత జిల్లాకు చేరుకున్నారు. అనువైన ప్రదేశాల్లో పోస్టింగ్ కోసం అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. అయితే వీరి పోస్టింగ్‌ల విషయంలో పరిస్థితులు గతాని కన్నా భిన్నంగా కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం హయాం లో జరిగిన భూ కుంభకోణాల్లో ఏ తహసీల్దార్ ఏ కేసులో ఇరుక్కున్నాడో అనే అనుమానాలతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎవరి పట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పోస్టింగ్‌లకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల నేపథ్యంలో నాయకులపై కూడా ఒత్తిడి తగ్గినట్లు కనిపిస్తోంది.

మార్గదర్శకాలు ఇవే...

తహసీల్దార్ పోస్టింగ్‌ల్లో ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయడంతో చాలా వరకు పారద ర్శక వాతావరణం నెలకొంది. తహసీల్దార్ ఎస్‌ఆర్‌లో పేర్కొన్న సొంత గ్రామం ఉన్న డివిజన్ పరిధిలో పోస్టింగ్ ఇవ్వకూడదు. ఉదాహరణకు అధికారి జన్మస్థలం నెల్లూరు అనుకుంటే ఆ అధికారికి నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధి లో ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకూడదు. మార్గదర్శకం రెండు ప్రకారం ఎన్నికల విధుల్లో భాగంగా పక్క జిల్లాకు బదిలీపై వెళ్లడానికి ముందు రోజు ఏ మండలంలో పనిచేశారో, ఆ నియోజకవర్గ పరిధిలో పోస్టింగ్ ఇవ్వకూడదు. ఉదాహరణకు ఎన్నికల బదిలీకి ముందు రోజు వరకు పొదలకూరు తహసీల్దార్‌గా పనిచేసిన అధికారికి ఇప్పుడు సర్వేపల్లి నియోజకవర్గ పరిధి లోని ఏ మండలంలో కూడా పోస్టింగ్ ఇవ్వకూడదు. మరో నియోజకవర్గంలో పోస్టింగ్ ఇవ్వాలి. ఈ నిబంధనలతో చాలా వరకు కోరిన మండలాల్లో పోస్టింగ్‌ల కోసం ఒత్తిడి తగ్గింది.

అనువైన చోటు కోసం పైరవీలు

ప్రస్తుతం జిల్లాలో తహసీల్దార్ క్యాడర్‌లో 42 మందికి పోస్టింగ్‌లు ఇవ్వాలి. సోమ, మంగ ళవారాల్లో పోస్టింగ్‌ల ప్రక్రి య పూర్తయ్యే సూచ నలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని కొన్ని ముఖ్యమైన మం డలాల్లో పోస్టింగ్‌ల కోసం ఇప్పటికే పైరవీలు, సిఫార్సుల పర్వం పూర్తయినట్లు తెలుస్తోంది. ముత్తుకూరు, టీపీ గూ డూరు, కోవూరు, ఇందుకూరుపేట, బుచ్చి సంగం, ఆత్మకూరు తదితర ఆదాయవనరులు ఉన్న మండలాల్లో పోస్టింగ్‌ల కోసం ఎమ్మెల్యేల మీద పెద్ద ఎత్తున ఒత్తిడి వచ్చింది. ఈ క్రమంలో సుమారు 10 రోజుల క్రితమే కొంతమంది ఎమ్మెల్యేలు తాము కోరుకొంటున్న తహసీల్దార్ల జాబితాను కలెక్టర్‌కు అందజేసినట్లు ప్రచారం సాగుతోంది.

- ఓ వివాదాస్పద అధికారికి లెటర్లు ఇచ్చిన ఎమ్మెల్యేలు
- విషయం తెలిసి భగ్గుమంటున్న రైతులు, నేతలు
- గతంలో నెల్లూరు డీఈగా పలు ఆరోపణలు
- అన్నదాతలపై చిందులు.. బినామీలతో వర్కులు
- తాజాగా ఆత్మకూరులోనూ విమర్శలు.. ఎమ్మెల్యే ఆనం ఆగ్రహం

అమ్మో ఆయనా...

వైసీపీతో అంటకాగిన వారికి ఇరిగేషన్‌లో అందలం

మాకొద్దు !

నెల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో ఆ అధికారి తీరే వేరు.. ఎక్కడికెళ్లినా వివా దాలే.. రైతుల కష్టాలు తీర్చాల్సిన ఆయనకు అసలు రైతులంటేనే పడదు..! ఏదైనా సమస్యతో అన్నదాతలు కార్యాలయా నికి వస్తే వారిపై చిందులు వేయడం.. బినామీ పేర్లతో వర్కులు చేయడం ఆ అధికారి నైజం... సదరు ఆ అధికారిపై అనేక విచారణలు జరగ్గా, కొన్నింటిలో రికవరీకి కూడా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. 2014లో నెల్లూరు డీఈగా ఆయన పనిచేస్తున్న సమయంలోనే నాటి టీడీపీ ప్రభుత్వం ఆయనపై చర్యలు కూడా తీసుకుంది.

అయితే, అదే వివాదాస్పద అధికారిని ఇప్పుడు మళ్లీ నెల్లూరు డీఈగా తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నాయి. పైపెచ్చు సెంట్రల్ డివిజన్ ఈఈ పోస్టును కూడా ఇన్‌చార్జిగా కట్టబెట్టేందుకు ఒప్పందం కూడా జరిగినట్లు తెలిసింది. అసలు ప్రభుత్వం బదిలీల జీవో ఇవ్వకముందే ముగ్గురు ఎమ్మెల్యేల దగ్గర నుంచి సదరు అధికారి లెటర్లు తీసుకున్నారు. ఆ లెటర్ల ద్వారా నెల్లూరు డీఈ పోస్టు తెచ్చుకునేందుకు రాష్ట్ర కార్యాలయంలో పావులు కదుపుతు న్నారు. అయితే గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో సదరు అధికారి అంటకాగారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పనిచేస్తూ వైసీపీ నేతలకు చెరువుల్లోని మట్టిని దోచిపెట్టారు. లేఅవుట్లకు ఇరిగేషన్ కాలువలను ధారాదత్తం చేశారు. వీటిపై మంత్రి ఆనం ఇటీవల జరిగిన సమావేశంలో సదరు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లేఅవుట్లపై విచారణకు కూడా ఆదేశిం చారు. ఇలాంటి అధికారికి కీలకమైన నెల్లూరు డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వడంపై రాష్ట్ర ఉన్నతాధికా రులు కూడా ఆలోచనలో పడ్డారు. కానీ కొందరు టీడీపీ ముఖ్యనేతలు మాత్రం సదరు అధికారికి ఎలాగైనా పోస్టింగ్ ఇప్పించాలని తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.



ఆగ్రహిస్తున్న అన్నదాతలు

పెన్నా డెల్టా పరిధిలో నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఎంతో ముఖ్యమైంది. ఈ డివిజన్ కింద సుమారు మూడు లక్షల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. నెల్లూరు, బుచ్చి, కనుపూరు కాలువ సబ్ డివిజన్లు ఉన్నాయి. అందులోనూ నెల్లూరు సబ్‌డివిజన్ ప్రధానమైనది. ఈ సబ్ డివిజన్ కింద అధికారిక, అనధికారిక ఆయకట్టు సుమారు లక్ష ఎకరాలకు పైగా ఉంది. అందులోనూ సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ముత్తుకూరు, వెంకటాచలం, టీపీ గూడూరు మండలాల్లో సుమారు 65 వేల ఎకరాలు, కోవూరు నియోజకవర్గ పరిధి ఇందుకూరుపేట మండలంలో 20 వేల ఎకరాలు, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ డివిజన్‌లో పనిచేసే అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండాలి. అలాంటి నెల్లూరు సబ్‌డివిజన్ డీఈ పోస్టు కోసం ప్రస్తుతం ఆత్మకూరు నియోజక వర్గంలో పనిచేస్తున్న ఓ అధికారి తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే సర్వేపల్లి, కోవూరు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేల వద్ద నుంచి లెటర్లు కూడా పొందినట్లు తెలు స్తోంది. వాస్తవానికి ఈ అధికారిపై ఆ ఎమ్మెల్యేలకు మంచి అభిప్రాయం లేకపో యినా ఓ నాయకుడి ఒత్తిడితో లెటర్లు ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారు. ఈ లెటర్ల ద్వారా తనకు పోస్టింగ్ ఇవ్వాలంటూ ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు సదరు అధికారి దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న డెల్టా రైతాంగం భగ్గుమంటోంది. తమను కార్యాలయంలోకి కూడా రానివ్వని అధికారిని మళ్లీ ఎలా తీసుకొస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై మండల స్థాయి నాయకులు ఆయా ఎమ్మెల్యేల వద్ద పంచాయితీ పెట్టారు. తాము ఆ అధికారి చేత పని చేయించుకో లేమని, రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని మొరపెట్టుకుంటున్నారు. ఇప్పటికే నెల్లూరు సెంట్రల్ డివిజన్ భ్రష్టుపట్టి పోయిందని, దాన్ని చక్కదిద్దాల్సిందిపోయి మళ్లీ అక్కడి వివాదాస్పదుడిని తీసుకొస్తే భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు వస్తాయని అంటున్నారు.

గతంలోనే ఆరోపణలు

ఈ అధికారి 2014లో నెల్లూరు డీఈగా పనిచేశారు. నాడు అనేక ఆరోపణలు ఎదుర్కొ న్నారు. పోతిరెడ్డిపాలెం వద్ద పెన్నా నది నుంచి ఇసుకను అమ్మేశారని ఫిర్యాదులు రావడంతో ఆ విషయమై విచారణ కూడా జరిగింది. అలానే సర్వేపల్లి రిజర్వాయర్ రివిట్ మెంట్ పనుల్లో రూ.4 మేర అవినీతి జరిగినట్లు నాడు ఫిర్యాదులు అందాయి. ఇదే అధికారి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులను బినామీలుగా పెట్టుకొని వారిని నీటి సంఘాల ప్రతినిధులుగా పేర్కొంటూ ఇందుకూరుపేట, టీపీగూ డూరు మండలాల్లో నామినేషన్ వర్కు లు కట్టబెట్టారు. చివరకు పనులు నాసిరకంగా చేయడంతో రైతులు ప్రశ్నించిన తరుణంలో అసలు నిజాలు బయటప డ్డాయి. నెల్లూరు నగరంలో పలు బ్రిడ్జిల నిర్మాణాలు ఈ అధికారి సమయంలో జరగ్గా, చాలా వరకూ నాసిరకంగా జరిగాయని ఫిర్యాదులు ఉన్నాయి. స్టోన్ హౌస్‌పేట వద్ద పనులు చేస్తుండగా ఓ బ్రిడ్జి కూలిపోవడం అప్పట్లో ఇరిగేషన్ అధికారుల అవినీతిని బయటపెట్టింది. ఈ అధికారి తనకున్న పలుకుబడితో అనేక విచారణలను ఆపుకోగలిగారని చెప్పుకుంటున్నారు. అయితే గత టీడీపీ ప్రభుత్వంలోనే ఈ అధికారి అవినీతి నిజమని తేల్చి రూ.3.35 లక్షల రికవరీకి నాడు జీవో విడుదల కావడం ఇరిగేషన్ శాఖలో సంచలనంగా మారింది. నాడు రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెట్టడంతో వారంతా సదరు ఆ అధికారి అవినీతిని ఆధారాలతో సహా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం అప్పుడు ఆ అధికారిని నెల్లూరు నుంచి బదిలీ చేసింది.

కదలని విద్యుత్ వాహనాలు

- ఐదేళ్లకే ఈవీల మరమ్మతులు
- వదిలేసిన విద్యుత్ అధికారులు
- మళ్లీ అద్దె కార్లే దిక్కు
- సంస్థపై ఆర్థికభారం

నెల్లూరు (జడ్పీ), జూలై 28: పెట్రోల్ వాడకాన్ని పూర్తిగా తగ్గించడంతోపాటు కాలుష్య నియంత్రణ ఉంటుందని తొలుత ప్రభుత్వ అధికారులకు ఎలక్ట్రికల్ వాహనాల (ఈవీ)ను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా కరెంటు కార్ల వినియోగాన్ని పెంచాలన్న ప్రభుత్వాల లక్ష్యం కూడా తోడైంది. ఈ క్రమంలో జిల్లాలోని విద్యుత్ శాఖకు అంద చేసిన కరెంటు కార్లు ఐదేళ్ల తిరక్కముందే మూలపడ్డాయి. దీంతో విద్యుత్ శాఖాధికారులు ప్రస్తుతం వాహనాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో లాగా అద్దె కార్లను వినియోగిస్తున్నారు.



ఐదేళ్లకే మరమ్మతులు

జిల్లాలో మొదటగా కరెంటు వాహనాల వినియోగాన్ని ప్రయోగాత్మకంగా విద్యుత్‌శాఖ ప్రారంభించింది. 2019 ఏప్రిల్‌లో 14 ఈవీలను విద్యుత్‌శాఖ కొనుగోలు చేసింది. ఆ శాఖలోని అధికారులకు సంస్థ ద్వారా వాహనాలను ఏర్పాటు చేయాల్సి ఉండడంతో ఎక్కువగా బాడుగ కార్లను ఏర్పాటు చేస్తున్నందున ఆర్థికభారం పడేది. దీంతో కరెంటు వాహనాలు కొనుగోలు చేస్తే పెట్రోల్ ఆదాతోపాటు నెలవారీ ఈఎంఐల ద్వారా వాహన కొనుగోలు చేయవచ్చని 14 వాహనాలను కొనుగోలు చేసి అధికారులకు అప్పగించింది. వీటికి అధికారులు నెలకు రూ.25 వేల చొప్పున ఐదేళ్లపాటు ఈఎంఐలు చెల్లిస్తూ వచ్చారు. అయితే వాహనాల మరమ్మతులకు ఐదేళ్లపాటు కార్ల తయారీ సంస్థ వారంటీ ఇచ్చింది. ఓసారి చార్జింగ్ చేస్తే 120 నుంచి 130 కిలోమీటర్ల ప్రయాణం చేయవచ్చని సంస్థ పేర్కొంది. దీంతో ఆ కార్ల నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తిరిగేందుకు వినియోగించుకోవచ్చని అధికారులు భావించారు. అయితే తొలి రెండు, మూడేళ్లు పెద్దగా మరమ్మతులకు గురికాలేదు. ఆతర్వాత మరమ్మతులతోపాటు బ్యాటరీ చార్జింగ్ పడిపోయింది. ఓసారి చార్జింగ్ చేస్తే కేవలం 40 నుంచి 50 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణించే అవకాశం ఉంటుండడంతో గత రెండేళ్లుగా అధికారులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఐదేళ్ల వారంటీ సర్వీసు పూర్తికావడంతో కార్ల తయారీ సంస్థ బాధ్యతల నుంచి తప్పుకుంది. దీంతో మరమ్మతుల భారం అధికారులు మోయలేక, ఎక్కువ దూరం ప్రయాణం చేసే వీలులేక ఆ వాహనాలను తాము వినియోగించుకోలేమంటూ స్థానికంగా ఉన్న కార్ల కంపెనీకి తరలించారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులకు వేరే వాహనాలను ఏర్పాటు చేశారు. కరెంటు కార్లు ఉపయోగపడక పోవడంతో మళ్లీ అద్దె కార్లను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా కరెంటు కార్ల వల్ల తమ సంస్థపై అదనపు భారం పడిందని విద్యుత్ శాఖాధికారులు వాపోతున్నారు.

ఫోర్జరీ సంతకాల కేసులో పోలీసుల అదుపులో శివకృష్ణ ?

నెల్లూరు(క్రైం), జూలై 28: నెల్లూరు నగరపాలక సంస్థలో పూర్వపు కమిషనర్ సంతకాల ఫోర్జరీ కేసులో మేయర్ భర్త జయవర్ధన్ అనుచరుడు, నిందుతుడయిన శివకృష్ణను శనివారం రాత్రి హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకొని నెల్లూరుకు తరలించినట్లు సమాచారం. అప్పటి ఎన్‌ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ ఫిర్యాదు మేరకు నగర మేయర్ భర్త జయవర్ధన్‌తోపాటు ఆరుగురిపై దర్గా మిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులంతా పరారీలో ఉండటంతో పోలీసులు వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో శని వారం అర్ధరాత్రి హైదరాబాద్‌లో శివకృష్ణను అదుపులోకి తీసుకుని నెల్లూరుకు తీసుకువచ్చి నట్లు తెలిసింది. ఫోర్జరీ కేసులో ఇంకెంతమంది ప్రమేయం ఉందన్న విషయంపై శివకృష్ణ ను పోలీసు అధికారులు రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించడం లేదు.

పాఠాలు పూర్తికాకనే పరీక్షలా ?

- సిలబస్ చెప్పకుండానే ఫార్మాటివ్-1 ఎగ్జామ్స్
- గత ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఆలస్యంగా అందిన పుస్తకాలు
- విద్యార్థులకు తప్పని కష్టాలు
- భయాందోళనలో టీచర్లు

పొదలకూరు, జూలై 28: ఒక్కపక్క పాఠ్యపుస్తకాలు సకాలంలో అందక, టీచ్ టూల్ శిక్షణతో సిలబస్ పూర్తికాక సతమతమవుతుంటే.. మరో పక్క ఆగస్టు ఒకటి నుంచి ఫార్మెటివ్-1 పరీక్షలు నిర్వహించాల్సిందేనని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ హయాంలో సకాలంలో ముద్రణకు ఇవ్వకపోవడంతో పాఠ్యపుస్తకాల రాక ఆలస్యమైంది. జూన్ రెండో వారంలో పాఠశాలలు పునఃప్రారంభం కాగా అందుబాటులో ఉన్న పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు ఇచ్చారు. తర్వాత వచ్చిన పుస్తకాలను ఇప్పటివరకు పంపిణీ చేస్తూనే ఉన్నారు. దీనివల్ల సిలబస్ సకాలంలో పూర్తి చేయలేకపోయారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పరీక్షల షెడ్యూల్‌ను మార్చేందుకు అంగీకరించడం లేదని ఉపాధ్యాయులు వాపోయారు. సిలబస్ పూర్తికాకుండానే పరీక్షలను నిర్వహించడం సరికాదని.. కనీసం పది, పదిహేను రోజులు వాయిదా వేయాలని వారు కోరుతున్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఆగస్టు ఒకటి నుంచి 3వతేదీ వరకు ఫార్మెటివ్-1 పరీక్షల నిర్వహణకు ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు బోధనలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై శిక్షా సప్తాహ కార్యక్రమం పేరుతో 'టీచ్ టూల్' పేరిట ఉపాధ్యాయులకు వారంపాటు శిక్షణ ఇస్తున్నారు. సిలబస్ సకాలంలో పూర్తికాక పిల్లలు పరీక్షలు సరిగా రాయకపోతే మార్కులు రావు. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నందున ఉన్నతాధికారులు పరిశీలిస్తారు. ఫలితాలు బాగా లేకపోతే మెమోలిస్తారని ఉపాధ్యాయులు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే పరీక్షలను కొద్ది రోజులు వాయిదా వేయాలని వారు కోరుతున్నారు.

స్త్రీనిధి రుణ పరిమితి పెంపు

- రూ. 3.5 నుంచి రూ.5 లక్షల వరకు పెంచుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం
- ఉపాధి అవకాశాల మెరుగుకు దోహదం
- డ్వాక్రా సంఘాల సభ్యుల హర్షం

సంగం, జూలై 28: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల సాధికారతకు ఎన్డీఏ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వారి ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచాలనే ఉద్దేశంతో గతంలో కంటే మరింతగా రుణ సాయాన్ని పెంచింది. స్త్రీనిధి రుణ పరిమితిని సంఘానికి రూ. 3 లక్షల నుంచి రూ. 5లక్షలకు పెంచింది. దీంతో డ్వాక్రా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు లింకేజీతో సంబంధం లేకుండా ఉపాధి మార్గాలను ఇంకా మెరుగుపరుచుకోవడానికి స్త్రీనిధి రుణాలు ఉపకరిస్తాయని వారు భావిస్తున్నారు. వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి బయట అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన అవసరం ఉండదని వారంటున్నారు.

జిల్లాలోని 38 మండలాలు, మున్సిపాలిటీలు, నెల్లూరు కార్పొరేషన్‌లో కలిపి మొత్తం సుమారు 39 వేల డ్వాక్రా సంఘాలు ఉన్నాయి.వీటిల్లో సుమారు 3.36 లక్షల మంది సభ్యులు ఉన్నారు. పది నుంచి 12 మంది సభ్యులు ఒక సంఘంగా, 20 నుంచి 30 సంఘాలను కలిపి ఒక సంఘబంధం చొప్పున, గ్రామంలోని సంఘాలను బట్టీ సంఘబంధాలు ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని సంఘబంధాలను కలిపి మండలస్థాయిలో సంఘమిత్ర, సంఘమిత్రాలన్ని కలిపి జిల్లా వ్యాప్తంగా జిల్లా స్థాయిలో జిల్లా సమాఖ్య ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లా సమాఖ్య పనిచేస్తుంది. ఈ జిల్లా సమాఖ్యకు ప్రభుత్వం గ్రాంటుగా నిధులు సమకూర్చుతుంది. జిల్లా సమైఖ్య ఈ నిధులను సంఘమిత్రలకు విడుదల చేస్తుంది. సంఘమిత్ర సంఘాలకు స్త్రీనిధి పేరుతో రుణాలు మంజూరు చేస్తుంది. సంఘబంధాలకు ఇచ్చే ఈ రుణాల పరిమితిని కూటమి ప్రభుత్వం పెంచింది.

స్త్రీనిధి రూ. 3 నుంచి 5 లక్షలకు పెంపు

గతంలో ఒక్కొక్క పొదుపు సంఘానికి రూ. 3లక్షల మాత్రమే స్త్రీనిధి రుణాలు ఇచ్చేవారు. ఇవి చాలక బ్యాంకు నుంచి రుణాలు తీసుకోవాల్సి వచ్చేది. దీన్ని గమనించిన కూటమి ప్రభుత్వం స్త్రీనిధి రుణ పరిమితిని రూ. 5 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. బ్యాంకు లింకేజీతో తీసుకున్న రుణాలకు సభ్యులు చెల్లించే వడ్డీ బ్యాంకులకు చెందుతుంది. అదే స్త్రీనిధి రుణాలకు సభ్యులు చెల్లించే వడ్డీ ఆయా సంఘాలకు, సంఘబంధాలు, సంఘమిత్రలోనే ఉంటుంది. జిల్లా సమాఖ్య తీసుకోదు. దీంతో ఈ వడ్డీ ఆయా సంఘాలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ఉపకరిస్తుంది. టీడీపీ ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలు ప్రోత్సహించేలా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమయ్యేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా వీవోఏలకు పేటీఎం పరికరాలు అందచేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీటి ద్వారా సభ్యులకు నేరుగా రుణం చెల్లించనున్నారు.

మద్యం పాలసీపై విచారణ సాగేనా ?

ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నా మద్యం పాలసీల్లో మాత్రం పెద్దగా మార్పులు ఉండేవి కాదు. అయితే గతంలో ఎన్నడూలేని విధంగా గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన మద్యం పాలసీపై పలుఆరోపణలు, మందు బాబుల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలో తాము అధికారంలోకి వచ్చాక మద్యం పాలసీలో మార్పులు చేస్తామని టీడీపీ కూటమి నేతలు ఎన్నికల సమయంలో వాగ్దానం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో రెండు రోజులపాటు మద్యం పాలసీపై చర్చ కూడా సాగింది. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు వైసీపీ అమలు చేసిన మద్యం పాలసీపై విచారణ చేపడతామని, దోషులను శిక్షిస్తామని అసెంబ్లీలో ప్రకటించారు. దీంతో జిల్లాలోనూ విచారణకు ఆదేశిస్తారా...? అన్న చర్చ జోరుగా సాగుతోంది. కాగా వైసీపీ ప్రభుత్వం హయాంలో జిల్లా ఎక్సైజ్ శాఖలో అధికారిగా ఉన్న వ్యక్తి నాలుగేళ్లపాటు చక్రం తిప్పారన్న ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో విచారణకు ఆదేశిస్తే మరింతమంది వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. - నెల్లూరు(క్రైం)

- గతంలో ఎన్నడూలేని విధానానికి వైసీపీ శ్రీకారం
- ప్రభుత్వ దుకాణాల ఏర్పాటుతో అంతా గోల్‌మాల్
- సిబ్బంది నియామకంలోనూ చేతివాటం
- తక్కువ అద్దె ఉన్న షాపులకు రూ.వేలల్లో చెల్లింపులు
- బార్ల టెండర్లలోనూ సిండికేట్
- ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రకటనపై సర్వత్రా చర్చ

నేతలకు కాసుల వర్షం

జగన్ పాలనలో ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసేందుకు అద్దెకు దుకాణాలు కావాలంటూ ప్రకటన విడుదల చేశారు. ఇందుకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లోని రాజకీయ నాయకుల కనుసైగల్లో దుకాణాల కేటాయింపు జరిగింది. తక్కువ అద్దె ఉన్న ప్రాంతాల్లో అధిక అద్దె చెల్లించేలా నాయకులు, అధికారులు కుమ్మక్కై దుకాణాలను ఎంపిక చేశారు. దుకాణాలను అద్దెకు ఇచ్చేవారి నుంచి కూడా భారీగా వసూళ్లకు పాల్పడ్డారు. దుకాణాల్లో సిబ్బంది ఎంపికకు నిర్వహించిన ఇంటర్వ్యూలోనూ స్థానిక నాయకుల సిఫార్సు లేఖలకే ప్రాధన్యమిచ్చారు. ఉద్యోగాల్లో చేరే సమయంలో సదరు ఏజెన్సీ నిర్వాహకులు నిరుద్యోగుల నుంచి రూ.వేలల్లో నగదు వసూలు చేసినట్లు పలువురు పేర్కొన్నారు.

ఇక బార్లు కేటాయింపులోనూ గతంలో ఎప్పుడూ జరగని విధంగా ఆయా నియోజకవర్గాల వైసీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల కనుసైగల్లో ప్రక్రియ సాగింది. బార్లకు కొత్తవారు టెండర్లు వేయనీయకుండా బెదిరింపులకు పాల్పడ్డారు. టెండర్లు వేసే వారు అందరిని ఒక చోట సమావేశ పరిచి, అధిక టెండర్లు వేయకూడదని ఆదేశించారు. ఒక్కో బార్‌లో అధికార పార్టీ నేతలు పార్టనర్‌గా ఉండేలా నాయకులు మధ్యస్థాలు చేశారు. ఇదెక్కడి న్యాయం అని ఎవరైనా ప్రశ్నిస్తే... మమ్మల్ని కాదని నువ్వు ఎలా వ్యాపారం చేస్తావని బెదిరింపు దిగారు. ఇక బార్లలో కూల్‌డ్రింక్ షాపులు, నైట్‌సేల్స్ ఎవరికి ఇవ్వాలి, ఎంతమందికి ఇవ్వాలని కూడా నాయకులే చెప్పడాన్ని మొదటిసారి బార్ల యజమానులు చూశారు. ఇలా అన్నీ సెట్ చేసి ఒక్కో బార్ నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఇక మద్యం దుకాణాలు ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు తెరచి ఉండడం, బార్లు మాత్రం ఉదయం ఆరుకు తెరుచుకుంటే రాత్రి ఒంటి గంట వరకు మూయకపోవడంతో బార్లకు వ్యాపార మార్గాలను ప్రభుత్వమే చూపినట్లు అయింది. ఇక బార్‌లో ఎమ్మార్పీ కంటే రూ.60 నుంచి రూ.150కు పైగా వసూలు చేస్తున్నా పట్టించుకునే వారు కన్పించలేదు. ఇదెక్కడి న్యాయం అని పత్రికల్లో కథనాలు ప్రచురించి, అధికారులను ప్రశ్నిస్తే వారు ప్రభుత్వానికి చలానా రూపంలో రూ.కోట్లు కడుతున్నారు, అందుకే వారు నచ్చిన ధరకు మద్యం అమ్ముతారని సమాధానం చెప్పారు. ఇక ప్రభుత్వ మద్యం దుకా ణాల్లో, బార్లలో మద్యం కల్తీ గతంలో ఎప్పుడూ జరగని రీతిలో జరిగింది.



పట్టుబడిన మద్యాన్ని పరిశీలిస్తున్న సెబ్ అధికారులు(ఫైల్)

ఐదేళ్లు నరకం చూసిన మందుబాబులు

వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన మద్యం పాలసీతో మందు బాబులు మద్యం సీసాలు చేత పట్టుకొని నడి రోడ్డుపైకి వచ్చేశారు. నాణ్యమైన మద్యం స్థానంలో పిచ్చి మద్యాన్ని అందుబాటులోకి తేవడంతో దాన్ని సేవించి ఎంతోమంది అనారోగ్యం బారిన పడ్డారు. పలువురు మృత్యువాత కూడా పడ్డారు. వైసీపీ పాలనలో నాయకులు, అధికారులు పుష్కలంగా సంపాదించుకున్నా, మందుబాబులు మాత్రం నరకం అనుభవించారు.

అందుబాటులో లేని మద్యం

బార్లలో దొరికిన మద్యం ఇప్పటికీ ప్రభుత్వ మద్యం దుకాణాలు, మాల్స్‌లో దొరకడం లేదన్న ఆరోపణలు మందుబాబుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మారినా ఈ పరిస్థితి ఇంకెన్నాళ్లు అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. మరి బార్లకు అన్నీ బ్రాండ్ల మద్యం ఎలా అందుతుందో...? ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఎందుకు అందడం లేదో..? అధికారులే సమాధానాలు చెప్పాలని వారు అడుగుతున్నారు.

దుకాణాలకు కూడా అన్నీ బ్రాండ్లు పంపుతున్నాం



జిల్లాలోని అన్నీ ప్రభుత్వ మద్యం దుకాణాలకు సిబ్బంది ఇచ్చిన ఇండెంట్ ప్రకారం మద్యం సరఫరా చేస్తున్నాం. బార్లకు అందిస్తున్న అన్నీ బ్రాండ్లను కూడా వాటికీ పంపుతున్నాం. అయితే ముందుగా మంచి బ్రాండ్లు ఎక్కువగా సేల్ అవుతుండడంతో స్టాక్ అయిపోతున్నది. అంతేతప్ప బార్లకు, మద్యం దుకాణాలకు వేర్వేరుగా స్టాకు పంపడం లేదు.

- నాగమల్లేశ్వరరెడ్డి, ఎక్సైజ్ ఈఎస్

బాలికపై అత్యాచారం

● పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

● వైద్యపరీక్షల నిమిత్తం వైద్యశాలకు బాలిక తరలింపు

కావలి రూరల్, జూలై 28: అభం శుభం తెలియని 9 సంవత్సరాల బాలికపై మహబూబ్ బాష(53) అనే వ్యక్తి అత్యాచారం చేశాడు. ఈ సంఘటన కావలిలో ఆదివారం వెలుగుచూసింది. రెండవ పట్టణ పోలీసుల వివరాల మేరకు... తుఫాన్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుండగా ఆయన భార్య పట్టణంలోని గార్మెంట్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. ఈనేపథ్యంలో తుఫాన్‌నగర్‌కు చెందిన మహబుబ్‌బాష బాధితురాలి ఇంటి సమీపంలో శనివారం కూలిపనికి వచ్చాడు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో బాలిక ఒంటరిగా ఉండటాన్ని గుర్తించి బాలిక తండ్రితో ఉన్న పరిచయం మీద ఇంటికి వెళ్లి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవ్వరికీ చెప్పవద్దని బాలికను బెదిరించి వెళ్లిపోయాడు. పనుల నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక జరిగిన విషయాన్ని చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. నిందితుడిని అతని ఇంటివద్ద అదుపులోకి తీసుకుని డీఎస్పీ వెంకటరమణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన రాంగ్‌రూట్ ప్రయాణం

● బైక్‌ను ఢీకొని యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), జూలై 28: రాంగ్‌రూట్‌లో వెళ్లి బైక్‌ను ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన నగరంలోని బోడిగాడితోట సమీపంలో ఆదివారం జరిగింది. నార్త్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. నగరంలోని స్టోన్‌హౌస్‌పేటకు చెందిన వెంకట ఆంజనేయ ప్రవీణ్‌కుమార్(35) ఓ ప్రముఖ చికెన్ మసాల సంస్థలో డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్నాడు. కోవూరులోని స్నేహితుడి ఇంట్లో ఓ ఫంక్షన్ ఉండటంతో ఆదివారం అక్కడకు వెళ్లాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. బోడిగాడితోట సమీపంలో మైపాడుగేటు వైపు రాంగ్‌రూట్‌లో వెళ్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ శివ శంకర్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట


పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

పొదలకూరు, జూలై 28 : తమకు ప్రాణహాని ఉందని, మమ్మల్ని రక్షించాలంటూ ఓ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు దిండు మనోజ్, పులి మాధురి విలేకరులతో మాట్లాడుతూ గత పదేళ్లగా ప్రేమించుకుంటున్నామని, శనివారం గూడూరులోని నరసింహస్వామి దేవస్థానంలో పెళ్లి చేసుకున్నామని తెలిపారన్నారు. తమ తల్లిదండ్రుల నుంచి వారికి ప్రాణహాని ఉందని, అందుకే పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించామన్నారు. ఎస్పీ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

గుంటూరు ఆర్‌పీఎఫ్ సంరక్షణలో తప్పిపోయిన బాలిక


తప్పిపోయిన బాలిక

కావలి టౌన్, జూలై 28: గుంటూరు ఆర్‌పీఎఫ్ సంరక్షణలో తప్పిపోయిన బాలిక ఉందని, ఆచూకీ తెలిసినవారు కావలి ఆర్‌పీఎఫ్ స్టేషన్‌లో (రైల్వే) సంప్రదించాలని ఆర్‌పీఎఫ్ ఎస్సై సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఆర్పీఎఫ్ సంరక్షణలో 7 సంవత్సరాల బాలిక కట్టా జ్యోతి (తండ్రి కట్టా వెంకటేశ్వర్లు, తల్లి రాణి) రైల్వేస్టేషన్ రోడ్డు కావలి చెరువు వద్ద నివాసమన్నట్లు వివరాలు తెలిశాయన్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు కావలి ఆర్పీఎఫ్ ఎస్సై 9701373716 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

యువకుడికి కత్తిపోట్లు

● ఇంట్లో నిద్రిస్తుండగా నలుగురు దాడి ● ఉలిక్కిపడ్డ మనుబోలు


కత్తిపోట్లకు గురైన శశిధర్‌రెడ్డి

మనుబోలు, జూలై 28: ఇంట్లో నిద్రిస్తున్న ఓ యువకుడిపై నలుగురు ఒక్కసారిగా వచ్చి కత్తితో దాడిచేసి గాయపరిచారు. ఈ సంఘటన ఆదివారం మనుబోలులో చోటుచేసుకుంది. దీంతో ఒక్కసారిగా గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. స్థానిక పడమరవీధిలో నివాసముంటున్న మొలకు శశిధర్‌రెడ్డిపై ముక్కాల హర్షవర్ధన్‌రెడ్డి,మరో ముగ్గురు యువకులు ఇంట్లో చొరబడి ఛాతి, మెడ, పొట్టపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా గూడూరు రూరల్ మండలం వెందోడు గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, మనుబోలుకి చెందిన శశిధర్‌రెడ్డి మామకు డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుని తిరిగేవాడు. బెంగళూరులో తలదాచుకుంటున్న హర్షవర్ధన్‌రెడ్డిని గుర్తించి, మామకు డబ్బులు ఇప్పించే విషయంలో శశిధర్‌రెడ్డి సాయం చేశాడు. ఈ ఘటన సుమారు ఏడాదిక్రితం జరిగింది. అప్పటినుంచి శశిధర్‌రెడ్డిపై హర్షవర్ధన్‌రెడ్డి కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మోటార్‌సైకిల్‌పై హర్షవర్ధన్‌రెడ్డి ముగ్గురు స్నేహితులతో శశిఇంటికి సాయంత్రం నాలుగు గంటలకు చేరుకున్నాడు. ఇంట్లోకి వారు రాగానే శశి తల్లి ఎవరు, ఎందుకు వచ్చారని అడుగుతుండగానే వినిపించుకోకుండా మిద్దెపైకి వెళ్లారు. శశిధర్‌రెడ్డి నిద్రిస్తుండగా వెంటనే మెడపై, ఛాతీ, పొట్ట, వీపుపై దాడిచేశారు. దీంతో శశి కేకలు వేయడంతో మూడో అంతస్తులో ఉన్న శశితండ్రి హరనాథ్‌రెడ్డి పరుగున వచ్చాడు. అప్పటికే శశిపై బలంగానే కత్తులతో దాడిచేశారు. దీంతో వారిని అడ్డుకోబోయిన హరనాథ్‌రెడ్డిని తోసేసి నలుగురు యువకులు మోటార్ సైకిల్‌పై పరారయ్యారు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న శశిని గ్రామస్థులు హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ ఘటనపై శశిధర్‌రెడ్డి తండ్రి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దాడిచేసిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

ఉదయగిరి రోడ్డులో ఆక్రమణలు

● పట్టించుకోని అధికారులు ● వాహన చోదకుల ఇక్కట్లు


వెంగళరావునగర్‌లోని ఉదయగిరి రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన ఐస్‌క్రీం దుకాణం

కావలి, జూలై 28: పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో రోజురోజుకు ఆక్రమణలు పెరుగుతున్నా, అధికారులు పట్టించుకోవడంలేదు. ఆర్వోబీ వంతెన నుంచి వెంగళరావునగర్ సబ్‌స్టేషన్ వరకు దక్షిణం వైపున రోడ్డు ఆక్రమణలకు గురైంది. వాస్తవానికి రోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్నా ఆక్రమణదారుల నుంచి మున్సిపల్ అధికారులు పన్నులు వసూలు చేస్తున్నారు. బతుకు తెరువు కోసం ఆక్రమించుకున్న వారు కొంతమంది మాత్రమే ఉండగా, కొందరు చోటా నేతలు ఆక్రమించి ఇతరులకు అద్దెలకు ఇస్తున్నారు. తొలుత రోడ్డు అంచున మాత్రమే ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటుండగా, కొంతమంది మరీ రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు చేస్తున్నారు. రోడ్డు మీదకు వచ్చిన బంకులతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని వాహనచోదకులు భయపడుతున్నారు. బంకులు రోడ్డుపై కనిపిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవటం వెనుక ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆక్రమణలతో ప్రమాదాలు పొంచి ఉన్నందున వెంటనే వాటిని తొలగించాలని వారు కోరుతున్నారు.


ఉదయగిరి రోడ్డుపైనే ఉన్న చికెన్ దుకాణం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	115
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6529
వెండి కిలో ధర	రూ. 84,100
వెండి ఒక గ్రాము	రూ. 86.10


నాడు కాసులు.. నేడు కన్నీళ్లు !

● దిగజారిన బత్తాయి ధరలు

● దిగుబడులూ అంతంత మాత్రమే

● పెట్టుబడులు కూడా రావంటున్న రైతులు

ఉదయగిరి రూరల్, జూలై 28: ఒకప్పుడు బత్తాయి తోటలతో కళకళలాడిన ప్రాంతం ఉదయగిరి. ప్రతి ఏటా రైతులకు కాసులు కురిపించే బత్తాయి తోటలు ప్రస్తుతం నష్టాలను మిగుల్చుతున్నాయి. గతంలో టన్ను రూ.70 వేల వరకు పలికిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం రూ.15 వేలు కూడా పలకకపోవడం గగనంగా మారింది. కాయ నాణ్యతగా ఉంటే టన్ను రూ.20 వేలు పలుకుతుంది. రసం తగ్గిన కాయల కొనుగోలుకు వ్యాపారులు మక్కువ చూపడంలేదు. దీనికితోడు దిగుబడి సైతం బాగా తగ్గిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు 5 నుంచి 6 టన్నుల కంటే దిగుబడి రావడంలేదు. గతంలో ఇతర రాష్ట్రాల వ్యాపారులు వచ్చి కాయలు చెట్లకు ఉన్నప్పుడే కొనుగోలు చేసివారు. నేడు ఆ పరిస్థితి తలకిందులైంది. ఈ ధరలతో పెట్టిన పెట్టుబడులు కూడా రావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రవాణాకు సిద్ధంగా ఉన్న బత్తాయి కాయలు

● **పెట్టుబడులు పెరిగి...**

బత్తాయి సాగుకు పెట్టుబడులు అధికం. గతంలో మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ విస్తారంగా బత్తాయి సాగు ఉండేది. ప్రస్తుతం రెండు, మూడు మండలాలకే పరిమితమైంది. దీనికితోడు వేరుకుళ్లు, బంక, వైరస్ తెగుళ్లు అధికం కావడంతో వాటి నివారణకు రైతులు మందులు పిచికారీ చేసేందుకు, దున్నకానికి, చెట్ల పాదులు చేసేందుకు కూలీలకు భారీగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అయితే మార్కెట్‌లో గిట్టుబాటు ధర పలకకపోవడంతో పెట్టుబడులు కూడా కష్టమయ్యాయి.


సాగులో ఉన్న బత్తాయి తోట

● **తగ్గిన ధర, దిగుబడి**

ఈ ఏడాది ధర లేకపోగా సీజన్‌లో కాపు దిగుబడులు కూడా అంతంతమాత్రంగా ఉండడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మరోవైపు గత కొన్నిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గడంతో ధరలు దిగజారాయి. ధర, దిగుబడి లేకపోవడంతో కూలీల ఖర్చులు, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి తోటలకు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టామని, ధర లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రెండవ ఏఎన్ఎంల సమస్యల పరిష్కారానికి కృషి


వినతిపత్రం స్వీకరిస్తున్న ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూలై 28 : జిల్లా వ్యాప్తంగా వివిధ పీహెచ్‌సీలలో విధులు నిర్వహిస్తున్న రెండవ ఏఎన్ఎంల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.రమణారెడ్డి చెప్పారు. ఆదివారం ఏపీజీఈఏ కార్యాలయంలో పీహెచ్‌సీలలో పనిచేసే రెండవ ఏఎన్ఎంలు కలిసి, తమ సమ్యలు పరిష్కరిచాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ ఏఎన్ఎంల రెగ్యులరైజేషన్, అదనపు సీఎల్ మంజూరు, యూనిఫాం భత్యం, ఈహెచ్ఎస్ కార్డుల మంజూరు, పని ఒత్తిడి తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ ఏఎన్ఎల నాయకురాళ్లు దేవకి, నీరజ, ఉమ, ఇందిర, మాధవి, హేమలత, కీర్తి, సుప్రజ, రాజీ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 9.571 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, జూలై 28: సోమశిల ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 9.571 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

సూర్యనారాయణే మా నాయకుడు

● ఏపీజీఈఏ జిల్లా కార్యవర్గం సంపూర్ణ మద్దతు


మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం); జూలై 28 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణకే తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని, ఆయనే మా నాయకుడని ఏపీజీఈఏ జిల్లా నాయకులు, కార్యవర్గ సభ్యులు ప్రకటించారు. నగరంలోని ఏపీజీఈఏ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణపై శనివారం ఐఎన్‌టీయూసీ నాయకులు జి.ఆస్కార్‌రావు ఆరోపణలు చేస్తూ సంఘంలో విభజన వచ్చినట్లు ప్రకటించటం హాస్యాస్పదమన్నారు. ఈ వివరణను తాము ఖండిస్తున్నామన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులతో సంప్రదించి, సాధారణ సభ్యుల అభిప్రాయాలు తీసుకుని జిల్లా మొత్తం ఏకగ్రీవంగా సూర్యనారాయణ నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామరు. జిల్లా కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్ మాట్లాడుతూ 2010 నుంచి కేఆర్ సూర్యనారాయణ ఏపీజీఈఏ బలోపేతానికి కృషి చేసి, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వారి మన్ననలను చూరగొన్నారన్నారు. ఆయన వెంటే తామంతా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.రమణారెడ్డి, మల్లికార్జున, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు 10 టీఎంసీల నీటిని కేటాయించాలి

● ఏపీ రైతు సంఘాల సమాఖ్య నేతల డిమాండ్


మాట్లాడుతున్న చంద్ర రాజగోపాల్

నెల్లూరు(వైద్యం), జూలై 28 : జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు సోమశిలకు 10 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఏపీ రైతు సంఘాల సమాఖ్య నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏపీ రైతు సంఘం సీనియర్ నేత చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ కృష్ణానది పరివాహక ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు వచ్చాయన్నారు. అక్కడ నుంచి పోతిరెడ్డిపాళెం ప్రాజెక్టుకు 867 అడుగులకు నీరు వచ్చి చేరిందన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ నుంచి సోమశిలకు నీటిని విడుదల చేసి జిల్లా రైతాంగాన్ని కాపాడాలని కోరారు. ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ సోమశిలలో 9.5, కండలేరులో 6.5 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. ఇవి డెడ్ స్టోరేజ్‌కు పోను తాగునీటికి అవసరాలకు సరిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు 10 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారు. అక్టోబరు, నవంబరులో వర్షాల కారణంగా సోమశిల, కండలేరు నిండే అవకాశం ఉన్నందున అప్పుడే మద్రాసుకు 10 టీఎంసీలు పంపవచ్చని పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించి తక్షణం నీటిని విడుదల చేసేలా కృషి చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకమరాజు, పుల్లయ్య, కౌలు రైతుసంఘం నేత తుళ్లూరు గోపాల్, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

చుక్కల దుప్పిని చంపిన వ్యక్తి అరెస్టు

● మాంసం, సామగ్రి స్వాధీనం


నిందితుడు వెంగయ్యతోపాటు దుప్పి మాంసం, సామగ్రితో రేంజ్ అధికారి శేఖర్, సిబ్బంది

ఉదయగిరి రూరల్, జూలై 28: దుత్తలూరు మండలం భైరవరం గ్రామ సమీపంలో చుక్కలదుప్పిని చంపిన వ్యక్తిని అటవీ శాఖాధికారులు అదుపులోకి తీసుకొన్న సంఘటన ఆదివారం చోటుచేసుకొంది. ఉదయగిరి రేంజ్ కార్యాలయంలో ఆత్మకూరు రేంజ్ అధికారి ఆర్.శేఖర్ విలేఖరులతో మాట్లాడుతూ భైరవరం గ్రామ సమీపంలో చుక్కల దుప్పిని చంపి మాంసం విక్రయిస్తున్నారన్న సమాచారం ఉన్నతాధికారులు ఇవ్వడంతో తమ సిబ్బందితో పాటు ఉదయగిరి రేంజ్ సిబ్బంది ఉమ్మడిగా దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో బొమ్మల వెంగయ్య అనే వ్యక్తి గత రాత్రి గ్రామ సమీప పొలాల్లో 11 కేవీ విద్యుత్ కంచె ఏర్పాటు చేయడంతో చుక్కలదుప్పి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందన్నారు. మృతిచెందిన దుప్పిని వెంగయ్య కోస్తుండగా పట్టుకున్నామన్నారు. అతనితో పాటు దుప్పి మాంసం, తల, కాళ్లు, కత్తులు, విద్యుత్ కంచె ఏర్పాటుకు ఉపయోగించిన తీగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. దుప్పి వధించిన ప్రాంతం ఆత్మకూరు రేంజ్ పరిధిలోకి వస్తుందని ఆయన తెలిపారు. ఈ మేరకు నిందితుడిని సోమవారం ఉదయగిరి కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వోలు పిచ్చిరెడ్డి, రవీంద్రబాబు, శ్రీనివాసులు, ఎఫ్‌బీవోలు వెంకటేశ్వర్లు, జేకేవీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో యువ క్రీడాకారులు రాణించాలి

● ఏపీ బ్యాడ్మింటన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకానాథ్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాష్ట్ర అధ్యక్షుడు

నెల్లూరు(విద్య), జూలై 28 : బ్యాడ్మింటన్‌లో క్రీడలో యువ క్రీడాకారులు విరివిగా పాల్గొని రాణించాలని ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాల, బాలికల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు క్రమం తప్పకుండా జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అండర్-11, 13, 15, 17, 19 విభాగాలతో పాటు మెన్, ఉమెన్ కేటగిరిల్లో సింగిల్స్, డబుల్స్ పోటీలను ప్రారంభించామన్నారు. ఈ పోటీలకు 180 క్రీడాజట్లు పోటీ పడుతున్నాయన్నారు. గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ గుర్తింపు పొంది, బాయ్ ధ్రువీకరించిన పోటీల్లో పాల్గొనాలన్నారు. బాయ్ గుర్తింపు లేని పోటీల్లో పాల్గొని విలువైన సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకోవద్దన్నారు. అక్టోబరులో నెల్లూరులో అండర్-11 బాల, బాలికల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నామని, యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఆగస్టు నెలలో క్రీడాదినోత్సవం నాడు ఎస్ఎస్ఎఫ్ ద్వారా క్రీడాకారులకు నగదు రివార్డులు, పతకాలు అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కె.యతిరాజ్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు దూడల సుధాకర్, కోశాధికారి శ్రీకాంత్, సభ్యులు మద్దిపాటి ప్రసాద్‌రావు, రామ్మోహన్‌రావు, తాళ్లపాక వరప్రసాద్, డీఎస్ఏ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, కోచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి

● ఘనంగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర సత్య సీతారామశర్మ

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 28 : రాష్ట్రంలోని అర్చక కుటుంబ సంక్షేమం కోసం సుప్రీం కోర్టు తీర్పులో ఇచ్చిన సూచనలు యథాతథంగా అమలు చేయాలని శ్రీఆంధ్ర రాష్ట్రీయ ఆది శైవ (అర్చక) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామశర్మ డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరు బాలాజీనగర్ త్యాగరాజస్వామి కళ్యాణ మండపంలో జరిగిన శ్రీఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అర్చక సంఘం జిల్లా శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత 5 ఏళ్లలో ప్రభుత్వ పరంగా అర్చకులకు ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేదన్నారు. ఎప్పుడైనా అర్చకులకు మేలు జరిగిందంటే అది తెలుగుదేశం ప్రభుత్వంలోనేనని స్పష్టం చేశారు. అర్చకులకు గుర్తింపుకార్డులు, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. కనీస జీతం రూ.25వేలు ఇవ్వాలని, స్కేలు అమలు చేసే చోట 65(ఏ) అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్చకుల స్వాధీనంలో ఉన్న భూములకు టైటిల్ డీడ్ స్వామి పేరు మీద ఉంచి, అనుభవదారులుగా అర్చకులను చేర్చాలని, రైతు భరోసా, తదితర సంక్షేమ పథకాలు అర్చకులకు అందించాలని కోరారు. అర్చక కుటుంబంలో ఆంగ్ల విద్య చదువుకొన్నవారికి దేవదాయ శాఖలో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆగమ పాఠశాలలు ప్రారంభించాలని కోరారు. పల్నాడు జిల్లాలో అన్యాక్రాంతమైన అర్చక భూములు స్వాధీనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ జే.శ్రీనివాసరావు, తన పరిధిలో అర్చకుల అందరికీ సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

● **నూతన కార్యవర్గం**

శ్రీఆంధ్ర రాష్ట్ర ఆది శైవ అర్చక సంఘం నెల్లూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కొండకావూరు శేషగిరిరావు (కావలి), ప్రధాన కార్యదర్శి గుడ్లూరు ఫణికుమార్ (బుచ్చి), కోశాధికారి ముదివర్తి రవికాంత శర్మలతో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యనమండ సత్య సీతారామశర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పత్రి అనిల్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంఘాల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు జి.వాసుదేవరావు, ఐ.కామేశ్వరప్రసాద్, జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శి పి.ప్రసాదాచార్యులు, యు.వెంకటశేషాచార్యులు, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పందేల్లో సత్తా చాటిన నంద్యాల ఎడ్లు

పలేటివారిపాలెం, జూలై 28: మండలంలోని శాఖవరంలో పడమట బజారువారి ఆధ్వర్యంలో అంకమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలలో నంద్యాల జిల్లా గుంపసరమునుదిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లజత 3425.04 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ. 60 వేలు సాధించాయి. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్లజత 3313.07 అడుగులు లాగి రెండవ బహుమతి రూ. 50 వేలు, నందాల జిల్లా పులి చిన్నఓబులు రెడ్డి ఎడ్లజత 3132.07 అడుగులు లాగి మూడవ బహుమతి రూ. 40 వేలు, కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్లజత 3117.02 అడుగులు లాగి నాల్గవ బహుమతి రూ. 30 వేలు, బాపట్ల జిల్లా బల్లికువర గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్లజత 3084.01 అడుగులు లాగి 5వ బహుమతి రూ. 20 వేలు సాధించాయి. అదేవిధంగా గుంటూరు జిల్లా కంచనపల్లి గ్రామానికి చెందిన పి.ఆర్ మెమోరియల్ పులగం త్రిషష్టరెడ్డి ఎడ్లజత 3 వేలు అడుగులు లాగి 6వ బహుమతి రూ. 15 వేలు, కడప జిల్లా ప్రొద్దుటూరు టౌన్ ద్వారక గురివిరెడ్డికి చెందిన ఎడ్లజత 2889.05 అడుగులు లాగి 7వ బహుమతి రూ. 10 వేలు, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వీరాస్వామి ఎడ్లజత 2881.09 అడుగులు లాగి 8వ బహుమతి రూ. 5 వేలు సాధించాయి.

ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతి వడ్లమూడి మాధవరావు, రెండవ బహుమతి వడ్లమూడి బసవయ్య, 3వ బహుమతి వడ్లమూడి చినహజరత్తయ్య, 4వ బహుమతి ఉండవల్లి శంకరయ్య, 5వ బహుమతి నవ్వులూరి కృష్ణయ్య, 6వ బహుమతి వడ్లమూడి వెంకటరావు, 7వ బహుమతి వడ్లమూడి శ్రీనివాసులు అందజేశారు. కాగా, అంకమ్మ తిరునాళ్లలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.


బండ లాగుతున్న ఎడ్లు


అంకమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

జిల్లాస్థాయి టెన్నిస్ డబుల్స్ పోటీల ప్రారంభం

కావలి టౌన్, జూలై 28: కావలి పట్టణ జేబీ డిగ్రీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో ఆదివారం జిల్లా స్థాయి టెన్నిస్ డబుల్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. విశ్రాంత జేబీ అధ్యాపకుడు (హిందీ) భాస్కర్ తన తల్లితండ్రుల జ్ఞాపకార్థం నిర్వహించిన పోటీలకు ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి, విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జేబీ క్రీడలకు పుట్టినిల్లని,


క్రీడాకారులను పరియం చేసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

విశ్వోదయా విద్యాసంస్థల వ్యవస్థాపకుడే దొడ్ల రామచంద్రారెడ్డి టెన్నిస్ క్రీడా కారులని, క్రీడా పోషకులని, ఆయన అందించిన ప్రోత్సాహంతో వందలాది మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించారని డీఆర్ క్రీడాసేవలను స్మరించుకున్నారు. పోటీలు సోమవారంతో ముగుస్తాయని నిర్వాహకులు భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టివెంకటేశ్వర్లు, మన్నవ రవిచంద్ర, కాకి ప్రసాద్, పీడీలు మాల్యాద్రి, పాల్గొన్నారు.

ముగిసిన గంధమహోత్సవం


దర్గాలో ఫాతేహా నిర్వహిస్తున్న భక్తులు

అనంతసాగరం, జూలై 28: మండల కేంద్రం అనంతసాగరంలోని గుంతబజారులో వెలసి ఉన్న హజరత్ కరీముల్లా షాఖాదరీ వారి 131వ గంధమహోత్సవ వేడుకలు ముగిశాయి. ఆదివారం తెల్లవారు జామున ఉర్సు కార్యక్రమంలో భాగంగా గంధాన్ని ఫకీర్ల వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించి దర్గాకు చేర్చారు. ఫాతేహా అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. దర్గా ముతావల్లి సలావుద్దీన్, కమిటీ సభ్యులు కరీమొహిద్దిన్, ఖాదర్‌బాషా, మహమ్మద్‌అలీ, కరీముల్లా పర్యవేక్షణలో వేడుకలు జరిగాయి.

గంధమహోత్సవానికి విరాళం

ఉదయగిరి రూరల్, జూలై 28: పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీహజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్‌ఖాదర్‌ఖాన్‌సాహెబ్ ఖాదరీ ఔలియా 219వ గంధమహోత్సవం ఆగస్టు 3న జరగనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదివారం కావలిలోని తన నివాసంలో గంధమహోత్సవ నిర్వాహకులకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏడాది గంధమహోత్సవానికి విరాళం అందజేయడం అనవాయితీ అని, అందులో భాగంగానే ఈ ఏడాది కూడా అందజేశామన్నారు. అనంతరం గంధ మహోత్సవానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు రోజ్‌ధార్ మన్సూర్, కార్యదర్శి ఖాదర్‌బాషా, కావ్య ట్రస్టు ప్రతినిధి సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రధాని కృషి

కావలిటౌన్, జూలై 28: ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం రామ్మూర్తిపేటలోని శక్తి కార్యాలయంలో బీజేపీ నేతలు వీక్షించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సీవీసీ సత్యం మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రధాని మోది శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు బ్రహ్మానందం, మందా కిరణ్, సవీంద్ర, తిరుపతిస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు చింతాల రాజీనామా

కావలిటౌన్, జూలై 28: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతాల వెంకట్రావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం ఆయన రామ్మూర్తిపేటలోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ అనివార్య కారణాలవల్ల రాజీనామా చేస్తున్నానని భవిష్యత్ కార్యచరణ త్వరలో ప్రకటిస్తానన్నారు.

ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎస్ యాదవ్

బిట్రగుంట, జూలై 28: ప్రకృతి పరిరక్షణలో ప్రతిఒక్కరు భాగస్వాములై మనతో పాటు ప్రాణకోటిని రక్షించాలని వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ అన్నారు. బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి అధ్యక్షుడు ఎం స్వర్ణన్‌రాజు ఆదివారం శ్రీకారం చుట్టారు. క్రీడామైదానం పచ్చదంతో నిండే విధంగా పలు రకాల మొక్కలు ప్రతి సభ్యుడు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని అందచేసిన రైల్వే వైద్యులు ప్రభాకర్‌రాజ్ వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలను అభినందించి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

వైభవంగా గంగమ్మ కలశ మహోత్సవం


సంగం : కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

సంగం, జూలై 28: స్థానిక నిమ్మతోపు సెంటర్‌లో వెలసి ఉన్న గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం కలిశ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గంగమ్మతల్లికి మైలుతుడుపు కార్యక్రమంతో వేడుకలు ప్రారంభించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద మంత్రోశ్చరణల నడుమ పెన్నానది నుంచి కలిశ జలాలను తీసుకొచ్చి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్ధప్రసాదాలు స్వీకరించారు.

కొండాపురం జూలై 28: పార్లపల్లిలో పోలేరమ్మకు ఆదివారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గత రెండువారాలుగా అమ్మవారికి చద్దినైవేద్యం చెల్లించి మూడవవారం మహిలలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి నైవేద్యంగాచెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులందరూ పాల్గొన్నారు.


నైవేద్యం తీసుకువెళ్తున్న భక్తులు

● **సంగం:** మండలంలోని చెన్నవరపాడులో ఆషాడ మాసం సందర్భంగా ఆదివారం నరసాలమ్మదేవి గ్రామ పొంగళ్లను నిర్వహించారు. గ్రామం తూర్పు దిక్కున ఉన్న పొలాల్లో నరసానమ్మ ఆలయం ఉంది. పంట విరామ సమయంలో ఆషాడ మాసంలో ప్రతి ఏటా గ్రామ పొంగళ్లు పొంగిస్తారు. అందులో భాగంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

● **ఉదయగిరి రూరల్:** మండలంలోని దుర్గంపల్లి గ్రామంలో ఆదివారం గ్రామదేవతలైన పోలేరమ్మ, అంకాళమ్మలకు గ్రామస్తులు వైభవంగా పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్ల సామగ్రితో ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం చెల్లించడంతో పాటు కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు.

● **వరికుంటపాడు:** మండలంలోని తూర్పురొంపిదొడ్లలో వెలసి ఉన్న శ్రీ మానసాదేవి అమ్మవారి నెల పొంగళ్ల మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని శాకాంబరీదేవి అలంకరణలో ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగారపమ్మకు పూజలు

సంగం: మండలంలోని కోలగట్లలో వెలసి ఉన్న నాగారపమ్మదేవికి ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అనంతరం పూలతో అలంకరించి పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


నాగారపమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

ఇళ్ల స్థలాలపై విచారణ

ఉదయగిరి రూరల్, జూలై 28: మండలంలోని దాసరి పల్లి గ్రామ రోడ్డు సెంటర్‌లో పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై ఫిర్యాదులు రావడంతో తహసీల్దారు ఆదేశాల మేరకు ఆదివారం వీఆర్వో వెంకట్ విచారణ చేపట్టారు. సర్వేనెంబర్ 1191లోని 6.60 ఎకరాల విస్తీర్ణంలో 1998లో సుమారు 96 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ స్థలాల పక్కనే కావలి-సీతారామపురం 167-బీజీ జాతీయ రహదారి ఏర్పాటు కావడంతో ఆ స్థలాలకు డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు లబ్ధిదారులు స్థలాలను చదును చేసి బేస్‌మట్టాలు నిర్మించుకున్నారు. మరికొందరు పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ స్థలాలు ఎక్కుడున్నాయో చూపించాలంటూ తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో వివరాలు సేకరించారు.


దాసరిపల్లిలో లబ్ధిదారులను విచారిస్తున్న వీఆర్వో

డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

వింజమూరు, జూలై 28: ఉదయగిరి నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల బాధలను చూసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందించి ఉదయగిరి, వింజమూరు సీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ కేంద్రాల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఈప్రాంత ప్రజల తరఫున ఐటీడీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబరు రాజేష్‌నాయుడు ఎమ్మెల్యేకు, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన

బిట్రగుంట, జూలై 28: వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ సక్రమంగా అందచేయాలని, లేకపోతే పంట నష్టం జరిగితే విద్యుత్ శాఖ వారు భరించాల్సి ఉంటుందని రైతులు హెచ్చరించారు. విద్యుత్ కోతలకు నిరసనగా బోగోలు, సీఎల్‌పురం, ఏకే కండ్రిక, చెన్నారెడ్డిపాలెం, కొత్తూరు గ్రామాల రైతులు చెంచులక్ష్మీ పురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరచూ విద్యుత్ కోతలు, అంతరాయం వలన పంటకు నీరు సక్రమంగా అందడంలేదని, నీరు లేక వేరుశనగ పంట ఎండిపోతోందని, రైతులకు ఇస్తున్న విద్యుత్ పేరుకు ఏడుగంటలని, కానీ మూడుగంటలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి పంట నష్టపోకుండా చూడాలని రైతులు కోరారు.


సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేస్తున్న రైతులు

సైన్స్‌పై విస్తృత ప్రచారం

వరికుంటపాడు, జూలై 28: ప్రస్తుత సమాజంలో సైన్స్‌పై విస్తృతంగా ప్రచారం చేపట్టడంలో జేవీవీ కీలక పాత్ర పోషిస్తుందని ఆ శాఖ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కుమ్మిత శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన జాతీయ మహాసభలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అందులో భాగంగా ప్రతి మూడు నెలలకు గ్రామాల్లో రక్తదాన శిబిరాలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు పీ చెన్నకేశవులు, పీఎం చలం, సీనియర్ నాయకులు ఎం సుబ్బారావు, వెంకటసుబ్బయ్య, మాలకొండయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

ఘనంగా పోలేరమ్మకు పొంగళ్లు

వరికుంటపాడు: మండలంలోని గణేశ్వరాపురంలో ఆదివారం భక్తులు గ్రామ దేవత పోలేరమ్మతల్లికి ఘనంగా పొంగళ్లు నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో పొంగళ్ల సామగ్రిని ఊరేగింపుగా తీసుకొని వచ్చి ఆలయానికి చేర్చారు. ఆలయ ప్రాంగణంలోనే పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలి : బీజేవైఎం

అనంతసాగరం, జూలై 28: మండలంలోని ముస్తాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న లిటిల్ ఏంజెల్స్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లంపాటి సాంబశివారెడ్డి తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆ పాఠశాలలో చదివే విద్యార్థిని తండ్రి బుజ్జిరెడ్డిపై కరస్పాండెంట్ మల్లికార్జున అకారణంగా దాడిచేసిన ఘటన దారుణమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ముస్తాపురం వద్ద పాఠశాల నిర్వహిస్తుంటే మండల విద్యాశాఖాధికారి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో తెలియడం లేదన్నారు. మార్కులు సక్రమంగా రావడం లేదని ప్రశ్నించినందుకు దాడికి దిగడం సరికాదన్నారు ఈవిషయంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు వల్లూరు రాజేష్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేవైఎం నాయకులు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


నగదును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, జూలై 28: మునిసిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన నలుగురు కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 10,000 వంతున రూ. 40,000లను సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి అందజేశారు. 2వ వార్డు పరిధిలోని షేక్ బీబి, 12వ వార్డు పరిధిలో ఆత్మకూరు వెంకటమ్మ, 23వ వార్డులో కొమరగిరి పెద్దతిరుపతమ్మ, షేక్ బీబీజాన్ కుటుంబాలను ఆయన పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో తమకు ఆర్థిక సాయం అందజేసిన శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలపై తీర్మానాల ఆమోదం



సమావేశంలో పాల్గొన్న జిల్లా కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య

సీతారామపురం, జూలై 28: ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం గుంటూరులోని సమన్వయ సంఘ భవనంలో 16 జిల్లాల రాష్ట్ర కమిటీ మెంబర్లు హాజరై సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించడం జరిగిందని జిల్లా కుమ్మర శాలివాహన సంఘ అధ్యక్షులు అల్లూరి వెంకటసుబ్బయ్య తెలిపారు. సమావేశంలో కుల వృత్తుల వారికి అన్యాయం జరగకుండా గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 1076ను అన్ని మండలాల్లో అమలు పరచాలని, కుమ్మరి కుల వృత్తి చేసుకునే 50 సంవత్సరాలు దాటిన వారికి ప్రభుత్వ పెన్షన్ మంజూరు చేయాలని పలు తీర్మానాలను ప్రవేశ పెట్టి ఆమోదించడం జరిగిందన్నారు. అలాగే నెల్లూరు జిల్లా పడమటి గూడూరులో ఉన్న సర్వే నెంబర్ 1988లో 46 ఎకరాల భూమిని పింగాణి పరిశ్రమకోసం రాష్ట్ర సంక్షేమ సంఘానికి రిజిస్టర్ చేయటం జరిగింది. కొన్ని అనివార్యకారణాలతో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమీకరించడంలో ఆలస్యమైనందున గత ప్రభుత్వం స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసింది. దానిని మరలా సంక్షేమ సంఘానికి పింగాణి పరిశ్రమ కోసం ఇవ్వాల్సిందిగా తీర్మానించి ఆమోదించడం జరిగిందని ఆయన తెలిపారు.

ధ్యానంతో జ్ఞానం

వింజమూరు, జూలై 28 : వింజమూరులోని శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ధ్యానంతో జ్ఞానం వస్తుందని, ధ్యానమే ముక్తికి మార్గమని తాడిపర్తి సీనియర్ పిరమిడ్ మాస్టర్ విశ్వనాథరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ధ్యానంతో అన్ని రకాల సమస్యల నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ధ్యానులందరికీ బద్వేల్ మాస్టర్ వెంకటసుబ్బయ్య చక్కటి ధ్యానప్రసాదం అందించారు. అలాగే శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, తిరుపతిరావు, అంకిరెడ్డి, చిన్న, సుబ్బారెడ్డి, విజయ్, విద్యుల్లత, హేమలత, రాజేశ్వరి, సుప్రజ, పార్వతి, పెంచలమ్మ, కృష్ణవేణి, ధ్యానులు పాల్గొన్నారు.

వార్డు సభ్యురాలి మృతికి సంతాపం

కొండాపురం, జూలై 28: మండల పరిధిలోని సాయిపేట పంచాయతీ 8వ వార్డు సభ్యురాలు మార్నేని పిచ్చమ్మ (75) ఆదివారం మృతిచెందింది. దీంతో గ్రామ, మండల టీడీపీ నేతలు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

మోటారు సైకిళ్ల చోరీలతో ప్రజలు బెంబేలు

కందుకూరు, జూలై 28: కందుకూరు పట్టణంలో ఇటీవలి కాలంలో మోటారుసైకిళ్ల దొంగతనాలు ప్రారంభకావటంతో వాహన యజమానులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నేళ్లుగా పట్టణంలో మోటారుసైకిళ్ల దొంగల జాడ లేకపోవటంతో వాహనదారులు ప్రశాంతంగా ఉన్నారు. అయితే పదిరోజుల వ్యవధిలో మూడు ప్రాంతాలలో వాహనాల చోరీ జరగటంతో పట్టణంలో వాహనాల దొంగలు ప్రవేశించార ని అర్థమవుతున్నదని ద్విచక్రవాహన యజమానులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని జనార్ధనకాలనీ మూడవ లైనులో ఆదివారం ఉదయం 11గంటల సమయంలో పట్టపగలే హోండా యాక్టివా స్కూటీ దొంగలించబడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనాల వినియోగం విపరీతంగా పెరగటంతో వివిధ పనులపై వచ్చేవారు వాహనాలను రోడ్లపైనే పార్కింగ్‌చేసి బ్యాంకులు, షాపింగ్, ఇతర పనుల కోసం వెళ్లటం పరిపాటి. కాగా, ఇలా పట్టపగలే వాహనాల దొంగలు చెలరేగిపోతుంటే ఇక రక్షణ ఎలా ఉంటుందని వాపోతున్నారు. ఏ వాహనం కొనాలన్నా లక్షల్లో ఉన్న తరుణంలో వాహనం అపహరణకు గురైతే సామాన్యుల పరిస్థితి అగమ్యగోచరమని, పోలీసులు స్పందించి వాహనాల దొంగలపై దృష్టిపెట్టి వారి ఆటకట్టించాలని కోరుకుంటున్నారు.

భగవద్గీతను పాఠ్యాంశాల్లో చేర్చాలి

ఆత్మకూరు, జూలై 28: గీతా వైభవమే భారత వైభవం, భగవద్గీతలోని సారాంశం ప్రజలందరూ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని గీతా వైభవ్ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ నజీర్ బాష తెలిపారు. ఆదివారం స్థానిక షిర్డిసాయి పిరమిడ్ కేంద్రంలో భగవద్గీత పారాయణము, ప్రవచనము, ధ్యాన- జ్ఞాన శిక్షణ తరగతులు, సజ్జన సాంగత్యం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితంలో భగవద్గీత అవసరం చాలా ఉందని, విద్యార్థి దశనుంచే దాని గొప్పతనం తెలియజేయాల్సి ఉందని, అందుకు పాలకులు భగవద్గీతను పాఠ్యాంశాలలో చేర్చాల్సి ఉందన్నారు. ఇంటింట భగవద్గీత అనే కార్యక్రమాన్ని ధ్యాన సాధకులు ముందుకు తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం కృష్ణ భక్తులకు, ధ్యానసాధకులకు శ్రీమద్భగవద్గీత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్లు డాక్టర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం, చంద్రా విజయ, గీతా వైభవ్ ట్రస్ట్ సభ్యులు సుష్మ పాల్గొన్నారు.


భగవద్గీత పుస్తకాలను అందజేస్తున్న షేక్ నజీర్‌బాషా

విద్యార్థి దశ మధురమైంది : ఎమ్మెల్యే దగుమాటి

కావలిటౌన్, జూలై 29: ప్రతిఒక్కరి జీవితంలో విద్యార్థి దశ మధురమైనదని ఎమ్మెల్యే డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వృందా హోటల్‌లో జేబీ డిగ్రీ కళాశాలలో 1987లో బీకాం చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్న కార్యక్రమంలో స్నేహితులు వారిని సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్నేహితుల సహకారంతో విద్యార్థి సంఘం నాయకుడుగా పనిచేశానని అన్నారు. కాగా, కలిసి చదువుకున్న స్నేహితుడు ఎమ్మెల్యేగా గెలవడం సంతోషంగా ఉందని, కావలి అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు.

దివ్యాంగులను కించపరిచిన ఐఏఎస్ అధికారిపై చర్యలు తీసుకోవాలి

కావలి టౌన్, జూలై 28: దివ్యాంగుల మనోభావాలను కించపరిచే విధంగా వ్యాఖ్యానించిన తెలంగాణా ఐఏఎస్ అధికారిణి స్మితసబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని దివ్యాంగుల కాలనీలో విలేకర్ల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సామర్థ్యం లేదని వ్యాఖ్యానించడం సిగ్గుచేటని, కీలక పదవిలోనున్న ఐఏఎస్ అధికారిణి అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర నాయకులు శైలేష్, అమిరిశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, గోపి, తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మండవ

వ్యవసాయ రంగాన్ని కాపాడాలి

కావలిటౌన్, జూలై 28: వ్యవసాయ రంగాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాళ్ళూరు మాల్యాద్రి పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కసాయి వీధిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 30, 31 తేదీలలో కావలి పట్టణ సీపీఎం కార్యాలయంలో రెండురోజులపాటు వ్యయసాయ కార్మిక సంఘం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగుతులు జరగనున్నట్లు తెలిపారు. పై కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లు పాల్గొంటారని కార్మిక సంఘానికి సంబందించినవారందరూ పాల్గొని శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ. 2లక్షల50వేల కోట్లు కేటాయించాలన్నారు. పట్టణంలోని పేద కూలీలకు కూడా ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న తాళ్లూరు మాల్యాద్రి

చిన్ననాటి గురువుకు పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

జలదంకి, జూలై 28: ఒకటి నుండి ఐదో తరగతి వరకు విద్యను నేర్పిన గురువు మదార్‌బాషా ఇటీవల అనారోగ్యానికి గరయ్యాడని తెలిసి జలదంకి మండలం బి.కె అగ్రహారం పూర్వ విద్యార్థులు రూ. 52,500 ఆర్థిక సాయం అందించారు. కావలి పట్టణం వెంగళరావు నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న గురువును ఆదివారం కలుసుకుని ఆర్థిక సాయం అందించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోగోలు మండలం అక్కరాజుకండ్రిగ ఎంకె స్కూల్ కరస్పాండెంట్ సాదనాల మనోహర్‌నాయుడు, కలవకూరి క్రిష్ణ, లింగంగుంట వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


గురువుకు ఆర్థిక సాయం అందిస్తున్న సాదనాల మనోహర్‌నాయుడు

యథేచ్ఛగా గ్రావెల్, మట్టి తరలింపు

బిట్రగుంట, జూలై 28: బోగోలు మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో గ్రావెల్, మట్టి, తువ్వఇసుక తరలింపు యధేచ్ఛగా కొనసాగుతోంది. ప్రధానంగా బోగోలు, కప్పరాళ్ళ తిప్ప, అల్లిమడుగు, ఉమా మహేశ్వరపురం గ్రామాల్లో అడుఆపు లేకుండా కొనసాగిస్తున్నారు. తిప్ప తహ సీల్దారు కార్యాలయానికి వెనుక కొద్ది దూరంలో గతంలో వైసీపీ నేతలు తవ్విన ప్రదేశాల్లో మరలా తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు. శనివారం కొన్ని చోట్ల అక్రమ తవ్వకాలు జరుపుతుంటే అధికారులు, స్థానికులు అడ్డుకోవడం జరిగింది. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.


ట్రాక్టర్లతో బోగోలు చెరువులో మట్టి తరలిస్తున్న అక్రమార్కులు

దుర్గంధం వెదజల్లుతున్న మురుగు కాలువలు

లింగసముద్రం, జూలై 28: మండలంలోని పెదపవని ముస్లిం కాలనీలోని మురుగు కాలువలు దుర్గంధం వెదజల్లుతుండడంతో అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలోని మురుగు కాలువల్లో మురుగునీరు పారుదలలేక నిలువ ఉండి దోమలకు నివాసాలుగా మారాయి. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.


పెదపవని ముస్లిం కాలనీలో మురుగు కాలువ

నెల్లూరు సిటీ, రూరల్

కోవూరు, సర్వేపల్లి



డీఈ అనిల్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రోడ్డు పనుల్ని అడ్డుకున్న రైతులు

కోవూరు, జూలై 28: పడుగుపాడు - నెల్లూరు నగర రోడ్డు నిర్మాణ పనుల్ని ఆదివారం రైతులు అడ్డుకున్నారు. ముదివర్తి కాలువ బ్రిడ్జి నిర్మాణంలో అధికారులు అవలంబిస్తున్న తీరు వల్ల మూడువేల ఎకరాల్లోని సాగునీటికి ఇబ్బందిగా మారుతుందని చెప్పారు. జాతీయ రహదారి పనుల్ని పర్యవేక్షిస్తున్న డీఈ అనిల్‌కుమార్‌రెడ్డితో రైతులు మాట్లాడి సమస్యను వివరించారు. కాలువ బ్రిడ్జి పనుల్ని నిలిపివేసి కొత్త ప్రతిపాదనలతో నిర్మించాల్సిందిగా లేగుంటపాడు సర్పంచు జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు గుత్తికొండ వెంకయ్య, విన్నకోట రాఖీ, గొట్టిగుండాల మహేష్, దారపనేని శ్రీనివాసులు, ఫిరోజ్ ముదివర్తి తదితరులు డిమాండు చేశారు.

క్రికెట్ టోర్నమెంటు విజేత గుడ్లూరువారిపాలెం జట్టు

వెంకటాచలం, జూలై 28 : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో ఐదు రోజులుగా మండల స్థాయిలో జరిగిన రాజేంద్ర యువశక్తి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా గుడ్లూరువారిపాలెం క్రికెట్ జట్టు నిలిచింది. మొత్తం 16 జట్లు పాల్గొనగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పాలిచెర్లపాడుపై గుడ్లూరువారిపాలెంకు మ్యాచ్ జరుగగా విన్నర్‌గా గుడ్లూరువారిపాలెం, రన్నర్‌గా పాలిచెర్లపాడు జట్టు నిలిచింది. విన్నర్‌కి రూ.20వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. రన్నర్ జట్టుగా నిలిచిన పాలిచెర్లపాడుకు రూ.10వేలు నగదు బహుమతి అందజేశారు. టీడీపీ జిల్లా సీనియర్ నేత రాధాకృష్ణారెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మావిళ్లపల్లి శ్రీనివాసులు నాయుడు, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి ఈపూరు సుబ్బారెడ్డి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు చల్లా నాగార్జున రెడ్డి, మోహిత్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి యనమల రాజేంద్ర, టీడీపీ మండల నేతలు చాట్ల వెంకటసుబ్బయ్య, బద్వేలు చెన్నకిష్టయ్య, మందల మణి, అంకయ్య, హరికృష్ణ, అమర్‌నాథ్, జమాల్, జగదీష్ విచ్చేసి క్రికెట్ టోర్నమెంటును వీక్షించి బహుమతులు అందజేశారు. టోర్నమెంటు ఆర్గనైజర్లుగా సుబ్బు, గోపి, అశోక్, బాబురావు వ్యవహరించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

వెంకటాచలం, జూలై 28 : వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న చర్చిలో ఆదివారం నైనా ఫౌండేషన్ ద్వారా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నైనా ఫౌండేషన్ అధ్యక్షురాలు ఎన్‌సీ సుహాసిని మాట్లాడుతూ కరోనా సమయంలోనూ మండలంలోని అనేక గ్రామాల్లో వంటసామగ్రి, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, బట్టలు పేదలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే తమ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కందే వినయ్‌కుమార్, హెచ్‌బీపీ సంస్థ అధినేత దయాసాగర్, మెదికో సైమన్ సాహిత్ తదితరులు ఉన్నారు.

ఏసీ స్టేడియంలో 'శతమానం భవతి'

నెల్లూరు(విద్య), జూలై 28 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శతమానం భవతి కార్యక్రమం నిర్వహించారు. జూలై నెలలో జన్మించిన అసోసియేషన్‌లోని సభ్యులందరినీ ఒకే వేదికపై కలిపి శతమానం భవతి పేరుతో జన్మదినోత్సవం నిర్వహించారు. ప్రతి సభ్యుడిని సత్కరించి కేక్ కట్ చేయించి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారుడు నలుబోలు బలరామయ్యనాయుడు, నేతలు వినుకొండ వెంకటేశ్వర్లు, జీవీ.కృష్ణయ్య, మాగంటి ప్రసాద్, ఎస్‌కె.మహ్మద్, డి.జయరామానాయుడు, లక్కాకుల శ్రీనివాసులు, సభ్యులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో భారత్ సత్తా చాటాలి

నెల్లూరు(విద్య), జూలై 28 : పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అన్ని విభాగాల్లో సత్తా చాటాలని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ తెలిపారు. శాప్ ఆదేశాల మేరకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాండ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపేందుకు క్రీడా సంస్థ సెల్ఫీ స్టాండ్ ఏర్పాటు చేసిందన్నారు. దీనిలో భాగస్వాములైన భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియచేయాలన్నారు. అనంతరం చీర్ ఫర్ భారత్ అంటూ తమ సంకేతాన్ని చూపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కె.యతిరాజ్, సూపరింటెండెంట్ విజయ్ కుమార్, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం నేతలు పాల్గొన్నారు.



సెల్ఫీ స్టాండ్‌లో విజయ సంకేతాన్ని చూపుతున్న అధికారులు

రక్తదానం మహోన్నతమైన సేవ : గిరిధర్‌రెడ్డి



రక్తదాతలను ప్రశంసిస్తున్న టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జూలై 28 : నేటి సమాజంలో రక్తదానం ఓ మహోన్నతమైన సేవని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ధనలక్ష్మీపురంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను ప్రశంసించి మాట్లాడారు. క్రమం తప్పకుండా రక్తదానం చేయడం వల్ల తాను ఆరోగ్యంగా ఉండటంతో పాటు మరొక వ్యక్తి ఆపద సమయంలో ప్రాణాలు నిలబెట్టడం జరుగుతుందన్నారు. యువకుల్లో రక్తదానంపై మరింత చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ నిర్వహకులు విజయభాస్కర్, మోపూరు భాస్కర్‌నాయుడు, మస్తానయ్య, పవన్‌కుమార్‌రెడ్డి, రవి, టీడీపీ నాయకులు చక్రవర్ధన్‌రెడ్డి, ఈశ్వరయ్య, జలదంకి సుధాకర్, శివలు పాల్గొన్నారు.

గొలగమూడిలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు



వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

వెంకటాచలం, జూలై 28 : మండలంలోని గొలగమూడి గ్రామంలో ఆరు రోజుల కిందట ఓ యువకుడు విష జ్వరం బారిన పడ్డాడు. వివరాల మేరకు గ్రామానికి చెందిన శివ అనే యువకుడు విష జ్వరం బారిన పడి నాలుగురోజుల పాటు నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని కోల్కున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులతో మాట్లాడారు. దీంతో పంచాయతీ అధికారులతో కలిసి వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, అధికారులు పారిశుధ్య నిర్మూలనకు చర్యలు చేపట్టారు. ఆదివారం కాలువలో ఉన్న వ్యర్థాలు సైతం తొలగించి బ్లీచింగ్ చల్లారు. అలాగే ప్రతి ఇంటింటికి వెళ్లి పారిశుధ్యంపై అవగాహన కల్పించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి బాబురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పార్థసారధినాయుడు, దామోదర్, మనోహర్ తదితరులు ఉన్నారు.

పరిశ్రమలపై అధికార పార్టీ నేతల దౌర్జన్యాలు

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

నెల్లూరు(వైద్యం), జూలై 28 : జిల్లాలోని పలు పరిశ్రమలపై అధికార పార్టీ నేతల దౌర్జన్యాలు ఎక్కువవుతున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ విమర్శించారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తోటపల్లిగూడూరు మండలం వాటర్‌బేస్ కంపెనీలో కాంట్రాక్టు ఇవ్వాలని ఉద్యోగులపై దాడులు చేయడం సరికాదన్నారు. వెంకటాచలం మండలంలో బీర్ ఫ్యాక్టరీల క్యాంటీన్ అధికార పార్టీ నేతలకు ఇవ్వాలని దౌర్జన్యం చేయడం అన్యాయమన్నారు. రామాయపట్నం పోర్టులో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు కాంట్రాక్టును తమకు ఇవ్వాలని అధికార పార్టీ నేతలు ఒత్తిడి చేశారన్నారు. స్కీం వర్కర్స్, చిరు ఉద్యోగులపై అధికార పార్టీ నాయకులు దౌర్జన్యాలను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని హితవు పలికారు. లేదంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేతలు టీవీవీ ప్రసాద్, పెంచలనర్సయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు, జూలై 28 : మండలంలోని బ్రాహ్మణపల్లి, దుగ్గుంట, రాజుపాలెం గ్రామాల్లో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో రావుల దశయ్యగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ దేవత అంకమ్మతల్లి వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. వైసీపీ సీనియర్ నాయకుడు స్వర్ణ రాజాకు శస్త్ర చికిత్స జరిగిన నేపథ్యంలో అతనిని పరామర్శించారు.

టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయొద్దు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 28: టిప్పు సుల్తాన్ వందలాది మంది హిందువులను దీపావళి రోజున శిరచ్ఛేదన చేశాడని, బలవంతంగా హిందువులను ఇస్లాం మతంలోకి మార్చాడని అలాంటి వ్యక్తి విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేసేందుకు వీల్లేదని రామలింగాపురం బీజేపీ మండల అధ్యక్షుడు చిలకపాటి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని శ్రీహరి నగర్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిప్పు సుల్తాన్ ఆడవారిపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు చేశాడని, అటువంటి వ్యక్తిని ఈ రోజు కొంతమంది సమర్థించడం బాధాకరమన్నారు. మీరు అబ్దుల్ కలాం విగ్రహం పెట్టే పనైతే మేము కూడా సహకరిస్తామని టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఘంటా విజయ్, నాయకులు మదన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జూలై 28 : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యురాలు గంపల మంజుల మహాత్మాగాంధీ, ఆశ్రమ స్థల దాత పొణక కనకమ్మ విగ్రహాలకు పట్టువస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు మహాత్మాగాంధీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పక్కా భవనాలకు నోచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు!

● ఇరుకు గదుల్లో మగ్గుతున్న చిన్నారులు

కొడవలూరు, జూలై 28: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఇరుకు గదుల్లో మగ్గుతున్నారు. అంగన్‌వాడీలు స్థాపించి 30 ఏళ్లు కావస్తున్నా ఇప్పటివరకు పలు కేంద్రాలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో మగ్గుతున్నారు. మండలంలో మొత్తం 81 అంగన్ వాడీ కేంద్రాలున్నాయి. బసవాయపాలెం, గుండాలమ్మపాలెం, కొడవలూరు-2, నీలగిరి సంఘం, గండవరం, గువ్వగుంట, నాయుడుపాలెం, పెయ్యలపాలెం, రాజుపాలెం -2,3, , రైటర్ తోపు, టపాతోపు, తదితర గ్రామాల్లో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇరుకుగా అరకొర వసతులతో ఉన్న భవనాలలో చిన్నారులను ఆడించాలన్నా, చదువు చెప్పాలన్నా ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా ములగట్ల సంఘం, రమణారెడ్డిగుంట, వడ్డిపాలెం, యల్లయపాలెం అంగనావాడీ కేంద్రాలలో క్రీడా ప్రాంగణం లేదు, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి నూతన భవనాలను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వృద్ధులకు మందుల పంపిణీ



వృద్ధులకు మందులు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న దాతలు

ఇందుకూరుపేట, జూలై 28 : మండలంలోని కొత్తూరులో డీఎస్ఆర్ వృద్ధాశ్రమంలో ఆదివారం లేబూరు వెంకురెడ్డి కుమారుడు డాక్టర్ సుధీర్‌రెడ్డి, విజయలక్ష్మీ దంపతులు వృద్ధులకు మందులు, బిస్కెట్లు, తదితర సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయ కులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొ న్నారు.

కేన్సర్‌పై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ వరుణ్

నెల్లూరు(విద్య), జూలై 28 : చైతన్యపురి పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వేదాయపాళెం పార్కులో ఆదివారం కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేన్సర్ వైద్యులు డాక్టర్ కె.వరుణ్ ప్రకాష్, డాక్టర్ జి.హరిప్రియలు పాల్గొని వివిధ రకాల కేన్సర్లు, వాటి కారణాలు, నివారణ, చికిత్స తదితర అంశాలపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఆహార నియమాలు పాటించడంతో పాటు ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకుంటే కేన్సర్ బారి నుంచి తప్పించుకునే అవకాశాలున్నాయని తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్క్ కార్యదర్శి కొండూరు సుబ్బారావు, సింహపురి వైద్యశాల డాక్టర్ జి.దయాకర్‌రావు, కార్పొరేటర్ అహల్య, పార్కు కమిటీ సభ్యులు శ్రీరామమూర్తి, మస్తానయ్య, మహేష్‌నాయుడు, కె.కోటేశ్వర రావు, రమణారెడ్డి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

శాకాంబరిగా చాముండేశ్వరిదేవి



శాకాంబరి అలంకారంలో చాముండేశ్వరి దేవి

ఇందుకూరుపేట, జూలై 28: మండలంలోని గంగపట్నంలోని చాముండేశ్వరి దేవి శాకాంబరి అలంకారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు అనీల్‌స్వామి, రామకృష్ణస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొలపర్తి వెంకటరమేష్‌కుమార్, స్వర్ణలక్ష్మీ దంపతులు, ఈవో బండి శాంతయ్య, కొండూరు వెంకటరమణారెడ్డి, బొద్దుకూరు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ, ఎస్ఏల రాష్ట్ర కార్యవర్గ సమావేశం



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అసోసియేషన్ నాయకులు, పీఈటీలు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 28: విద్యార్థులు జాతీయ స్థాయిలో క్రీడా పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించాలంటే కేవలం జూనియర్ల సలహాలకే పరిమితం కాకుండా సీనియర్లు, పీహెచ్‌డీ వ్యాయామ ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకుంటే మంచిదని ఓ వ్యాయామ ఉపాధ్యాయుడు రాష్ట్ర అమరావతి పీఈటీ, ఎస్ఏ,(పీఈ)ల అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు జార్జిని కోరారు. దీంతో సమావేశంలో పాల్గొన్న ఇతర పీఈటీ, పీడీలు కూడా మద్దతు పలికారు. ఆదివారం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్వర్యంలో బుచ్చిలోని రెయిన్‌బో స్కూల్లో పీఈటీ,ఎస్ఏల రాష్ట్ర కార్యవర్గం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కరీముల్లా చౌదరి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, 26జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీల అధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. ఈ సమావేశంలో పీఈటీ బీవీ.రమణమయ్య, 26జిల్లాల పీఈటీలు, ఎస్ఏ (పీఈ)లు పాల్గొన్నారు.

కోసూరు రత్నంకు సౌత్ఇండియా ఎలైటెడ్ బ్రాండ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కోసూరు రత్నం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 28 : నెల్లూరు నగరంలోని విశాలాక్షి వృద్ధుల ఆశ్రమం నిర్వాహకుడు కోసూరు రత్నంకు శనివారం రాత్రి హైదరాబాద్ బేగంపేట కౌంట్రీ క్లబ్‌లో సౌత్ఇండియా ఎలైట్ బ్రాండ్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును గ్లోబల్ ఫినాలే ఫౌండేషన్ 2024 సంవత్సరానికి కోసూరు రత్నంకు ప్రదానం చేశారు. విశాలాక్షి వృద్ధుల ఆశ్రమ స్థాపించడమే కాక 150 మంది వృద్ధులను కన్నబిడ్డలా ఆదరిస్తున్న ఆయన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఈ అవార్డు అందుకున్న కోసూరు రత్నంను జిల్లా ప్రముఖులు అభినందించారు.

కంటేపల్లిలో వర్మికంపోస్టు పరిశీలన

వెంకటాచలం, జూలై 28 : మండలంలోని కంటేపల్లి గ్రామంలో ఆదివారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని (వర్మికంపోస్టు) టీడీ పీ, జనసేన నేతలు సంయుక్తంగా కలిసి పరిశీలించారు. వారు మాట్లాడు తూ గత ప్రభుత్వంలో పంచాయతీ అభివృద్ధి, పారిశుధ్య నిర్మూలన పనులు కూడా చేయలేదని ఆరోపించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో పంచాయతీ అభివృద్ధి చేసుకుంటా మన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆస్తోటి నాగరాజు, డబ్బుగుంట సుధాకర్, షేక్ రఫీ, ఆస్తోటి రవికుమార్ తదితరులున్నారు.

బుచ్చి ప్రభుత్వాసుపత్రిలో అందని వైద్యం

● ఫోన్‌లో వైద్యుల సూచనలు... నర్సుల చికిత్స ● ప్రైవేటు ఆసుపత్రులకు రోగుల పరుగులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై28 : బుచ్చిలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోగులకు వైద్య సేవలు అందడంలేదు. అత్యవసర పరిస్థితిలో వచ్చిన రోగులకు, వారి పరిస్థితిని బట్టి నర్సులు సమాచారమిస్తే వైద్యాధికారులు ఫోన్‌లో సూచనలు ఇస్తారు. డాక్టరు చెప్పే సూచనలతో నర్సులు రోగులకు చికిత్స చేస్తారు. గతంలో ఇలాంటి నిర్లక్ష్యపు వైద్యసేవలతో రోడ్డు ప్రమాదాల బాధితులు, హైరిస్క్ గర్భిణీలు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. దీంతో మృతుల బంధువుల నిరసనలు, ఆరోపణలను వైద్యులు ఎదుర్కొన్నారు. అయినా మళ్లీ రోగులపట్ల వైద్యుల నిర్లక్ష్యం కనిపిస్తున్నది. దీంతో అప్పులైనా పర్వాలేదనుకుంటూ పలువురు రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. బుచ్చి ఆసుపత్రికి బుచ్చితోపాటు సంగం, దగదర్తి, నెల్లూరు రూరల్ మండలం నుంచి నిత్యం 200నుంచి 250 వరకు రోగులు వస్తుంటారు. సంగం నుంచి దామరమడుగు వరకు హైవేపైన జరిగే ప్రమాదాల క్షతగాత్రలను ఈ ఆసుపత్రికే తీసుకువస్తుంటారు. సకాలంలో వైద్యులు ఉండక క్షతగాత్రులు ప్రైవేటు వైద్యానికి పరుగులు తీస్తున్నారు. వైద్యులు, నర్సులు పట్టించుకోకపోయినా ఓ స్వీపర్‌మాత్రం రోగులకు ఇంజక్షన్లు, సెలైన్లు, అవసరమైన మందులు ఇస్తుంటారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి బుచ్చి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు వైద్యసేవలు అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



బుచ్చి ప్రభుత్వాసుపత్రి

చేరి వారమైనా పట్టించుకోలేదు..

కాలికి దెబ్బతగిలి వారంరోజులైనా ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందలేదు. ఇక్కడే వుంటే కాలు పనికిరాదనే భయంతో కాలికి కట్టుకట్టించుకుని వెళ్లిపోయా. నాలుగు రోజులుగా ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నా.

- ఆత్మకూరు శ్రీనివాసులు, వవ్వేరు

ఇళ్ల స్థలాలపై విచారణ



దాసరిపల్లిలో లబ్ధిదారులను విచారిస్తున్న వీఆర్వో

ఉదయగిరి రూరల్, జూ లై 28: మండలంలోని దాసరి పల్లి గ్రామ రోడ్డు సెంటర్‌లో పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై ఫిర్యా దులు రావడంతో తహసీల్దారు ఆదేశాల మేరకు ఆదివారం వీ ఆర్వో వెంకట్ విచారణ చేప ట్టారు. సర్వేనెంబర్ 1191లోని 6.60 ఎకరాల విస్తీర్ణంలో 19 98లో సుమారు 96 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ స్థలాల పక్కనే కావలి-సీతారామపురం 167-బీజీ జాతీయ రహదారి ఏర్పాటు కావ డంతో ఆ స్థలాలకు డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు లబ్ధిదారులు స్థలాలను చదును చేసి బేస్‌మట్టాలు నిర్మించుకున్నారు. మరికొందరు పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ స్థలాలు ఎక్కడున్నాయో చూపించాలంటూ తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో వివరాలు సేకరించారు.

డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

వింజమూరు, జూలై 28: ఉదయగిరి నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల బాధలను చూసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందించి ఉదయగిరి, వింజమూరు సీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ కేంద్రాల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన

బిట్రగుంట, జూలై 28: వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ సక్రమంగా అందచేయాలని, లేకపోతే పంట నష్టం జరిగితే విద్యుత్ శాఖ వారు భరించాల్సి ఉంటుందని రైతులు హెచ్చరించారు. విద్యుత్ కోతలకు నిరసనగా బోగోలు, సీపీఎల్‌పురం, ఏకే కండ్రిక, చెన్నారెడ్డిపాలెం, కొత్తూరు గ్రామాల రైతులు చెంచులక్ష్మీ పురం లోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరచూ విద్యుత్ కోతలు, అంతరాయం వలన పంటకు నీరు సక్రమంగా అందడంలేదని, నీరు లేక వేరుశనగ పంట ఎండిపోతోందని, రైతులకు ఇస్తున్న విద్యుత్ పేరుకు ఏడుగంటలని, కానీ మూడుగంటలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి పంట నష్టపోకుండా చూడాలని రైతులు కోరారు.


చనిపోయిన టైగర్ రొయ్యలు

నెల రోజులుగా టైగర్ రొయ్యల సాగులో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. పలు రకాల వ్యాధుల బారిన రొయ్యపిల్లలు పడుతుండటంతో ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు. కొన్ని హేచరీల నుంచి నాసిరకం రొయ్య పిల్లల సరఫరానే దీనికి కారణమంటూ తిరుగుబాటుకు సన్నద్ధమవుతున్నారు. సంబంధిత హేచరీలపై చెన్నైలోని ఎంపెడా (ది మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలెప్‌మెంట్ అథారిటీ)కు కూడా ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్నట్లు సమాచారం.

- నాసిరకం రొయ్య పిల్లల సరఫరాతో తీవ్రంగా నష్టపోతున్నామంటున్న ఆక్వా రైతులు
- సంబంధిత హేచరీలపై తిరుగుబాటుకు సన్నద్ధం

టైగర్ టెర్రర్!



కోట, జూలై 28: సముద్రతీరంలోని కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలు ఆక్వాకు ప్రసిద్ధి చెందాయి. గతంలో వేలాది ఎకరాల్లో రొయ్యల సాగు జరిగింది. ఇక్కడికి పాతికేళ్ల క్రితమే టైగర్ రొయ్యను పరిచయమైంది. తర్వాత రైతులందరూ వెనామీ రొయ్య వైపు మొగ్గుచూపి లాభాలు గడిస్తూ వచ్చారు. అనంతరం ఈ సాగు కూడా గిట్టుబాటుకాక పోవడంతో రెండేళ్లుగా మళ్లీ టైగర్ సాగు చేపట్టారు. నెల రోజులుగా టైగర్ రొయ్యల సాగులో నష్టాలు మొదలయ్యాయి. పలు హేచరీల నుంచి సరఫరా అయ్యే టైగర్ రొయ్య పిల్లలు నాసిరకం కారణంగానే వైట్‌స్పాట్ వైరస్ వంటివి సోకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా తల్లిరొయ్య (బ్రోడర్)నుంచి పిల్లను ఉత్పత్తి చేయకుండా.. పిల్లరొయ్య నుంచే సీడ్ ఉత్పత్తి చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి సీడ్‌తో సాగు చేపట్టడంతో రొయ్య పిల్లలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిఘా పెంచాం

టైగర్ రొయ్యలలో వస్తున్న వ్యాధులపై పరిశీలన ప్రారంభించాం. రొయ్యపిల్లలు నాసిరకమా లేదా వాతావరణంలో వచ్చిన మార్పా? పరిశీలిస్తున్నాం. కొన్ని రొయ్యపిల్లలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపే ప్రయత్నంలో ఉన్నాం. ఆరోపణలు వస్తున్న హేచరీలపై నిఘా పెంచాం.

- నాగరాజు, మత్స్యశాఖ డీఎఫ్‌వో

జరగాల్సింది ఇలా..

అమెరికా, తైవాన్ నుంచి తల్లి (బ్రోడర్) రొయ్యలను అనుమతి కలిగిన హేచరీలు దిగుమతి చేసుకుంటాయి. ఆయా హేచరీలలో ఈ తల్లిరొయ్య నుంచి పలు పద్ధతుల్లో పిల్ల రొయ్యలను ఉత్పత్తి చేస్తారు. ఆ తర్వాత వీటిని రైతులకు విక్రయిస్తుంటారు.

ఏం జరుగుతోందంటే..

కొన్ని హేచరీలు అమెరికా వంటి దేశాల నుంచి తల్లిరొయ్యకు బదులు పిల్ల రొయ్యను దిగుమతి చేసుకుంటున్నాయి. ఇవి సరైన పరిపక్వత రాకుండానే వాటినుంచి పిల్ల రొయ్యలను తయారుచేసి రైతులకు సరఫరా చేస్తున్నారు. ఇటువంటి పిల్ల రొయ్యతో సాగు చేసిన ఎనిమిది రోజుల్లోపే అవి ఆక్సిజన్ పీల్చకుండా ఎదుగుదల లేకుండా చనిపోతున్నాయి. దీనివల్ల లక్షల రూపాయలను రైతులు నష్టపోతున్నారు. మరికొన్ని హేచరీల్లో అయితే మనదేశంలో ఉత్పత్తి అయిన తల్లి రొయ్యల నుంచి సరైన పద్ధతులు పాటించకుండా పిల్ల రొయ్యలను తయారు చేస్తుండటంతో అవి కూడా చనిపోతున్నాయి.

గంధమనేనికి కన్నీటి వీడ్కోలు

- టీడీపీ నేతల నివాళులు
- ఫోన్‌లో కుటుంబీకులకు సీఎం పరామర్శ

నింద్ర, జూలై 28: ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు గంధమనేని రమేష్ చంద్రప్రసాద్‌కు ఆదివారం కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి ఆదివారం ఆయన రమేష్ చంద్ర ప్రసాద్ కుమారుడు రాజేష్‌తో ఫోనులో మాట్లాడారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. రమేష్ చంద్ర భౌతిక కాయానికి పలమనేరు, చంద్రగిరి, పూతలపట్టు, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తినాని, మురళీమోహన్, భానుప్రకాష్, ఆదిమూలం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనుభవం కలిగిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. తమ రాజకీయ ఎదుగుదలలో ఆయన పాత్ర ఉందని గుర్తుచేసుకున్నారు. గ్రామస్థాయిలోని ద్వితీయ శ్రేణి నాయకులందరితో మంచి సంబంధాలున్న నాయకుడని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, కందేరి జయచంద్రనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మోహన్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, రాష్ట్ర నాయకులు పోతుగుంట విజయబాబు, ఆర్‌సీ మునికృష్ణ, నాగేంద్ర నాయుడు, శ్రీధర్‌బాబు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, నగరి మున్సిపల్ మాజీ చైర్మన్ కేజే కుమార్‌తోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది మంది తరలివచ్చారు.


చంద్రబాబుతో ఫోనులో మాట్లాడుతున్న రాజేష్


రమేష్‌చంద్ర ప్రసాద్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, మురళీమోహన్ తదితరులు


నివాళులర్పిస్తున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ఎస్వీయూ పోలీసు స్టేషన్ వద్ద

గంటపాటు ఉద్రిక్తత


41ఏ నోటీసు చూపుతున్న మోహిత్‌రెడ్డి

- తిరుపతికి ఉదయం 6.50 గంటలకు మోహిత్‌రెడ్డి తరలింపు
- పోలీసుల ప్రశ్నలకు సహకరించని వైనం!
- 41ఏ నోటీసు ఇచ్చి.. 8.05గంటలకు షరతులతో విడుదల


ఎస్వీయూ పోలీసు స్టేషన్ వద్ద పోలీసు బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), జూలై 28: ఎస్వీయూ పోలీసు స్టేషను వద్ద ఆదివారం ఉదయం గంటా 15 నిమిషాలపాటు ఉద్రిక్తత నెలకొంది. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని తీసుకొచ్చిన సందర్భంగా అదనపు ఎస్పీ కులశేఖర్ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే.. నాటి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జూలై 14న జరిగిన హత్యాయత్నం కేసులో వైసీపీ అభ్యర్థి, తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డి నిందితుడు. తండ్రి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సోదరుడు హర్షిత్‌రెడ్డితో కలిసి శనివారం రాత్రి దుబాయ్ వెళ్లడానికి బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో వేచి ఉన్న మోహిత్‌ను అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.తిరుపతి డీఎస్పీ రవిమనోహరాచారి నేతృత్వంలో 10 వాహనాలు.. 70 మంది పోలీసు భద్రత నడుమ చెవిరెడ్డి, ఆయన ఇద్దరి కుమారులను ఉదయం 6.50 గంటలకు తిరుపతిలోని ఎస్వీయూ పోలీసు స్టేషనుకు తీసుకొచ్చారు. మోహిత్‌రెడ్డి ఒక్కరినే స్టేషనులోకి తీసుకెళ్లారు.ఈ ఘటనతో వైసీపీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. విచారణలో భాగంగా పోలీసులు మోహిత్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. కానీ, విచారణలో ఆయన ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. అసలు తప్పు చేయకుంటే దుబాయ్‌కి ఎందుకు తప్పించుకుని వెళుతున్నారని.. హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ ఎందుకు దాఖలు చేశారని అడిగినట్లు సమాచారం. ఈ ప్రశ్నలకు ఆయన సమాధానాలు దాట వేసినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం 41ఏ నోటీసులిచ్చారు. ఎప్పుడు విచారణకు పిలిచినా రావాలని, స్థానికంగా అందుబాటులో ఉండాలని షరతులు విధించారు. అయితే మోహిత్‌రెడ్డి మాత్రం 'అరెస్టు చేయండి.. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచండి' అంటూ కొంతసేపు మొరాయించి కూర్చొన్నట్లు తెలిసింది. తద్వారా సానుభూతి పొందే ప్రయత్నం చేశారన్న వ్యాఖ్యలు వినిపించాయి. పోలీసులు మాత్రం 41ఏ నోటీసు ఇచ్చి 8.05 గంటలకు ఆయన్ను బయటకు పంపారు. కాగా, ఉదయం ఎస్వీయూ పోలీసు స్టేషన్ వద్ద సివిల్, రిజర్వు, ఎస్టీఎఫ్ పోలీసులతో భారీ భద్రత ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల వాహనాల రాకపోకలను నియంత్రించారు. ఎస్వీయూ స్టేషన్ చుట్టూ ఎవరినీ అనుమతించలేదు. పద్మావతి అతిథి గృహం సిబ్బందినీ లోపలకు పంపలేదు.

బెడిసికొట్టిన 'వ్యూహం'!

పోలీసు చర్యలతో సానుభూతి పొందాలన్న వైసీపీ వ్యూహం బెడిసి కొట్టిందా? ఈ ప్రశ్నకు రాజకీయవర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. మోహిత్‌రెడ్డి అరెస్టయితే చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపట్టేందుకు శ్రేణులను సిద్ధం చేసుకున్నారు. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకునేలా చర్యలు చేపట్టారు. కానీ, పోలీసు అధికారులు ఈ కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకూ విచారణకు అందుబాటులో ఉండాలంటూ 41ఏ నోటీసు ఇచ్చి పంపేశారు. దీంతో ఏం చేయాలో తోచక వైసీపీ వర్గాలు గందరగోళంలో పడ్డాయి. నియోజకవర్గవ్యాప్తంగా కూడా ఉద్రిక్తతలకు అవకాశం లేకుండా పోయింది.

చెవిరెడ్డి నిరసన



ఎస్వీయూ వర్సిటీ వద్ద ఫుట్‌పాత్‌పై అనుచరులతో కలిసి చెవిరెడ్డి భాస్కరరెడ్డి నిరసన చేపట్టారు. ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేని మోహిత్‌ని రెండు నెలల తర్వాత ఏ37గా చేర్చి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ప్రజా పోరాటాలు ఎలా ఉంటాయో ప్రభుత్వానికి, పోలీసు అధికారులకు రుచి చూపిస్తామని హెచ్చరించారు. తీవ్రవాది, ఆర్థిక ఉగ్రవాదికి ఇచ్చినట్లు లుక్‌అవుట్ నోటీసు జారీ చేసి ఇప్పుడు 41ఏ నోటీసుతో వదలి పెట్టడం ఈ ప్రభుత్వ దుర్మార్గపుతనానికి నిదర్శనమన్నారు. ఈ ప్రభుత్వానికి, పోలీసులకు దమ్ముంటే ఆధారాలతో న్యాయమూర్తి ఎదుట హాజరుపరచాలని డిమాండు చేశారు. చంద్రగిరి మండలం కూచువారిపల్లెలో తమ రెండు కార్లు, సర్పంచి ఇల్లు దహనం, తమ శ్రేణులపై దాడి చేసిన కేసులో నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. నాని కారుపై దాడి జరిగిన మాట వాస్తవమన్నారు. నానిపై 37 మంది దాడి చేసుంటే ఆయనకు ఎందుకు చిన్నగాయం కూడా తగల్లేదన్నారు. స్విమ్స్ నివేదికలే దీనికి సాక్ష్యమన్నారు. నానీపై తాను దాడి చేయలేదని కాణిపాకం లేదా ఏ దేవుడి వద్దనైనా ప్రమాణం చేయడానికి సిద్ధమని మోహిత్‌రెడ్డి తెలిపారు. నానీ అవినీతి, భూదందాలు, గ్రానైట్ అక్రమాలు, ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటాలు చేస్తామన్నారు. భయపెట్టి పాలన చేయాలంటే ప్రజలు తిరగబడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు.

తప్పు చేసిన వాళ్లకు శిక్ష తప్పదు: నాని

తిరుచానూరు: తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన దాడుల విషయం ప్రతిది మీడియాకు తెలుసన్నారు. పద్ధతి మార్చుకోకపోతే చెవిరెడ్డికి భంగపాటు తప్పదన్నారు. 'చట్టాన్ని నా చేతిలోకి తీసుకుని శిక్షించడానికి, తప్పుడు కేసులు పెట్టడానికి రెండు నెలలు ఎదురు చూడాల్సిన పనిలేదు. ఎన్నికలకు ముందు ప్రధాన నిందితుడిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేరు చెప్పాను. విచారణలో నిందితులు మీ పేరు ఎందుకు చెప్పారో తెలుసుకోండి. పోలీసుల విచారణలో భాగంగా మోహిత్‌రెడ్డిని 37వ నిందితుడిగా చేర్చారు. ప్రజలకు తప్పుడు సమాచారం... తప్పుడు సంకేతం ఇవ్వడం మానుకోవాలి. విదేశాల్లో చదివినా హత్యాయత్నం చేసిన వారికి శిక్ష తప్పదు' అని పులివర్తి నాని వ్యాఖ్యానించారు. చంద్రగిరి అభివృద్ధికే సమయం చాలని తాను.. చెవిరెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు సమయం ఎక్కడుందన్నారు.


ఆర్సీపురం మండలంలోని భూమి

భూమి ఉండేది రామచంద్రాపురం మండలం పరిధిలో అయితే తిరుపతి రూరల్ మండలం తహసీల్దార్ ధ్రువీకరించినట్లు నకిలీ రికార్డు తయారైంది. వాటికి రూరల్ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ కూడా చేసేశారు. ఫలితంగా రూ.కోటి విలువైన భూమి ఓ వైసీపీ నేత ఖాతాలోకి చేరిపోయింది. ఆలస్యంగా ఈ విషయం భూ యజమానికి తెలిసి కుయ్యోమొర్రోమంటూ రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం కానరాలేదు. ప్రభుత్వం మారిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని వేచిచూశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కొత్త కలెక్టర్‌ను గ్రీవెన్స్‌లో కలిశారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు కుమ్మక్కై వైసీపీ నేతకు తన భూమిని ఎలా కట్టబెట్టారో ఆధారాలతో ఫిర్యాదు చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీ నేత లీలలు?

ఆర్సీపురం మండలంలోని స్థలానికి తిరుపతి రూరల్‌లో ఫేక్ రికార్డులు

రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల సహకారంతో రూ.కోటి స్థలం స్వాహా

న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితుడు

తిరుపతిలో నివసించే కె.పురుషోత్తమ రెడ్డికి రామచంద్రాపురం మండలం సి.రామాపురం గ్రామంలో సర్వే నెంబరు 73/3లో 2.32 ఎకరాల పూర్తి విస్తీర్ణ భూమికి 1959 నుంచి రికార్డు ఉంది. 2022 ఏప్రిల్‌లో అనుమానం వచ్చి కొత్త అడంగల్ పరిశీలించగా 10 సెంట్ల భూమి తగ్గి 2.22 ఎకరాలని చూపించింది. ఖంగుతిన్న బాధితుడు రికార్డులను పరిశీలించగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఆర్సీపురం, తిరుపతి రూరల్ మండల ఉద్యోగులు కుమ్మక్కై తన భూమిలోని 10 సెంట్లను వేరే వ్యక్తికి ఇచ్చినట్లు తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ ద్వారా జారీ అయినట్లు నకిలీ 1-బీ, అడంగల్ ప్రైవేట్ మీ-సేవ లేదా ఇంటర్నెట్ సెంటర్లో సృష్టించినట్లు గుర్తించారు. ఆ తర్వాత ఈ భూమిని స్థానిక జడ్పీటీసీ ఢిల్లీరాణి (భర్త వైసీపీ నేత భానుకుమార్ రెడ్డి) పేరున డాక్యుమెంట్ నెంబరుగా (2282/2022)గా రిజిస్టర్ చేసేశారు. ఆర్సీపురం తహసీల్దార్ కార్యాలయంలో గతంలో ఆర్ఐగా పనిచేసిన జీవన్‌రెడ్డి ప్రధాన సహకారంతో వైసీపీ నేత వి.భానుకుమార్ రెడ్డి ఆ భూమిని తన భార్య ఢిల్లీరాణి పేరిట రిజిస్టర్ చేసుకున్నారు. ఈ లావాదేవీల్లో వీఆర్వో ప్రసాద్, డీటీ మునిశైలజ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ బాషా, సి.రామాపురం విలేజ్ సర్వేయర్ హర్షవర్ధన్‌లకు ప్యాకేజీ మొత్తం ఆర్ఐ జీవన్ ద్వారా పంచి.. భూమిని కొల్లగొట్టాడని ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారు. దీనిపై రెండేళ్లుగా కలెక్టర్, ఆర్డీవో, జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినా వారు విచారణ జరపడం లేదని వాపోయారు. ఆర్డీవో కార్యాలయంలో విచారణ జరపకుండా కొందరు సిబ్బంది అడ్డుపడుతున్నారని, భూ కుంభకోణానికి బాధ్యులైన ప్రభుత్వ ఉద్యోగులపై విచారణ జరిపి.. తగు చర్యలు తీసుకుని, 10 సెంట్ల భూమిని తిరిగి తన ఖాతాలో ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని బాధితుడు కోరుతున్నారు.


క్షతగాత్రులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజేంద్ర

టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ నేతల దాడి

శ్రీకాళహస్తి, జూలై 28: టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ నేతలు దాడి చేసి గాయపరిచిన ఘటన తొట్టంబేడు మండలంలోని కొత్తకండ్రిగ గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ రాజేంద్ర తెలిపిన వివరాల మేరకు.. కొత్తకండ్రిగ గ్రామంలో టీడీపీకి చెందిన సురేష్, వైసీపీకి చెందిన విజయకుమార్ మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఇటీవల ఎన్నికల సమయంలో ఇరువురి మధ్య మళ్లీ విభేదాలు తలెత్తాయి. ఆదివారం సురేష్, విజయకుమార్ మధ్య మాటా మాట పెరిగి వివాదానికి దారి తీసింది. ఆగ్రహించిన విజయకుమార్ తన బాబాయి బాబు, తమ్ముడు గురునాథంతో కలిసి కర్రలతో టీడీపీ సానుభూతిపరుడైన సురేష్ ఇంటిపై దాడి చేశారు.ఈ ఘటనలో సురేష్‌తోపాటు అతని భార్య షర్మిల, బావ రాజా, మామ వెంకటయ్య గాయపడ్డారు.క్షతగాత్రులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వాఆస్పత్రిలో చేరారు. ఎస్ఐ రాజేంద్ర ఆస్పత్రికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


షార్‌కు వాహనంలో వెళ్తున్న రాకెట్ పరికరాలు

షార్‌కు చేరిన రాకెట్ పరికరాలు

సూళ్లూరుపేట, జూలై 28: శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్)కు రాకెట్ ప్రయోగ పరీక్షలకు ఉపయోగించే వివిధ రకాల పరికరాలు ఆదివారం ప్రత్యేక వాహనంలో చేరాయి. షార్ నుంచి ఆగస్టు మొదటి వారంలో పీఎస్ఎల్వీ, గగన్‌యాన్ ప్రాజెక్టు పరీక్షలకు సంబంధించిన రాకెట్‌కు వినియోగించే విడి పరికరాలు కేరళ రాష్ట్రం తిరువనంతపురం నుంచి వాహనంలో తీసుకొచ్చారు. ఈ పరికరాలను రాకెట్ అనుసంధానానికి వివిధ దశల్లో అవసరాన్ని బట్టి వినియోగించనున్నారు.

పాలిటెక్నిక్‌లలో 31న స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విద్య), జూలై 28: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలో మిగిలిన డిప్లొమా సీట్ల భర్తీకి ఈనెల 31వ తేదీన ఉదయం 10గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు, ప్రవేశపరీక్ష రాయనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తర్వాత ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరుకావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని, కౌన్సెలింగ్ ద్వారా సీటు పొందిన విద్యార్థులు ఈ అడ్మిషన్లకి అనర్హులని పేర్కొన్నారు.

ఉద్యానవనం అందుబాటులోకి వచ్చేనా?



మూతపడిఉన్న ఉద్యానవనం

సూళ్లూరుపేట, జూలై 28: టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019లో జాతీయ రహదారి పక్కనే మన్నారుపోలూరు క్రాస్ రోడ్డు వద్ద రూ.49.85 లక్షలతో ఎన్.చంద్రబాబు నాయుడు ఉద్యానవనం ఏర్పాటుకు నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ శ్రీకారం చుట్టింది. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేశారు. మూడు ఎకరాల్లో పార్కు పనులు పూర్తయ్యాయి. అనంతరం టీడీపీ అధికారం కోల్పోవడంతో పార్కు గురించి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో నేటికీ ప్రారంభం కాకపోవడంతో పట్టణవాసులకు ఆహ్లాదం కరువైంది. ప్రస్తుతం ఆ ప్రదేశమంతా పిచ్చిమొక్కలతో నిండి పోయింది. టీడీపీ అధికారంలోకి రావడంతో ఇకనైనా పార్కును ప్రారంభించి అందుబాటులోకి తేవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రేపు ఆడికృత్తిక వేడుకలు

చిట్టమూరు, జులై 28 : మండల పరిధిలోని మల్లాంలో కొలువై ఉన్న వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 30న ఆడికృత్తిక వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం నూరు స్తంభాల కల్యాణ మండపంలో పంచామృత అభిషేకాలు జరుగుతాయన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనే భక్తులు నాలుగు పూలమాలలు, ఐదు రకాల పండ్లు, విడిపూలు సమర్పించాలని కోరారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు సంప్రదాయ వస్త్రాలు ధరించి పూజల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

వచ్చే నెల్లో 'పెళ్లి కాని ప్రసాద్' విడుదల

హీరో సప్తగిరి

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తాను నటించిన 'పెళ్లి కాని ప్రసాద్' సినిమా ఆగస్టులో విడుదల అవుతుందని హీరో సప్తగిరి తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'పెళ్లి కాని ప్రసాద్' సినిమా చూస్తే అందరికి పెళ్లి అవుతుందని నవ్వుతూ అన్నారు. అలాగే ఈచిత్రంతో పాటు 'గోల్డ్‌మెన్' అనే చిత్రంలో కూడా నటిస్తున్నట్టు తెలిపారు. 'పెళ్లి కాని ప్రసాద్' స్క్రిప్ట్ చిత్తూరు ఎమ్మెల్యే ఓకే చేశారన్నారు. ఇక, 'మా' ఎన్నికల గురించి మీడియా ప్రశ్నించగా తప్పకుండా అన్నిటిలో మా ముద్ర ఉంటుందన్నారు. తర్వాత రాజకీయాల ప్రవేశంపై స్పందిస్తూ ఎంపీ సీటు కోసం ప్రయత్నించిన మాట వాస్తవమే కానీ.. చిన్న పిల్లోడిని అప్పుడే ఎందుకు రాజకీయాలు అని తర్వాత చూద్దాం అనుకున్నట్టు చెప్పారు. తర్వాత ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. ఎక్కడికక్కడ తిరుమలలో పరిశుభ్రత పెరగడంతోపాటు క్రమశిక్షణ కనిపిస్తోందన్నారు. సీఎం ఆదేశాలతో వచ్చిన అధికారులు మంచి సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. కొత్తగా వచ్చిన అధికారులు ఈదేవస్థానాన్ని ఇంకా ఉన్నత స్థానానికి తీసుకువెళతారని ఆశిస్తున్నట్టు చెప్పారు.



సప్తగిరి, గురజాల జగన్మోహన్

శ్రీవారి సేవలో న్యాయమూర్తి

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం తమిళనాడు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు

నాయుడుపేట, జూలై 28: ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి చెప్పారు. ఆయన నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌ను సూళ్లూరు పేట ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జున, సిబ్బందితో పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆటోలు, ఇతర వాహనాలు యధేచ్ఛగా రాకపోకలు రాకపోకలు సాగిస్తున్నట్లు, తాగునీరు వంటి కనీస సదుపాయాలు లేనట్లు ఫిర్యాదులు అందాయన్నారు. బస్టాండ్‌లోని స్టాళ్లలో తినుబండరాలు, వాటర్‌బాటిళ్లు ఎంఆర్‌పికే విక్రయించాలన్నారు. సీటీఎం వెంట నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ కంట్రోలర్ శంకర్ ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ సీటీఎం

జనసేన క్రియాశీలక సభ్యత్వంతో బీమా భరోసా

నాయుడుపేట, జూలై 28: జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడం ద్వారా కార్యకర్తలకు రూ.5లక్షల బీమా భరోసా ఉంటుందని ఆ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ చెప్పారు. నాయడుపేట పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించిన అనంతరం జనసేన క్రీయాశీలక సభ్యత్వాల నమోదున్ను చేపట్టారు. న్యాయవాది వి.పార్థసారథి రెడ్డి సహా పలువురు సభ్యత్వం తీసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రవీణ్

మల్లికాంబ దేవస్థానంలో మెగా వైద్యశిబిరం

నాయుడుపేట టౌన్, జూలై 28: పట్టణంలోని స్వర్ణముఖినది ఒడ్డున కొలువై ఉన్న మల్లికాంబ దేవస్థానంలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని దేవస్థాన నిర్వాహకుడు ఆమాస వెంకట రామనారాయణ ప్రారంభించారు. నాయుడుపేట, పరిసర ప్రాంతాల నుంచి పలువురు హాజరై వైద్య పరీక్షలు చేయిం చుకున్నారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. అలాగే చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించారు. డాక్టర్లు ప్రవీణ్యాయాదవ్, మునిరాజ, మునిరత్నం, టీడీపీ నాయకులు జి.సుధీర్ రెడ్డి, తెలుగు యువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఏ.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

గూడూరు అర్బన్, జూలై 28: స్థానిక జనార్ధన రెడ్డి కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దాతృత్వంతో రూ.5వేలు ఆర్థికసాయాన్ని ఆదివారం స్థానిక టీడీపీ నాయకులు టి.చంద్రమౌళి, మైనంపాటి మోహన్, కాశీ అందజేశారు.

హై లెవల్ వంతెనల నిర్మాణం కలేనా?

గూడూరు, జూలై 28: భారీ వర్షాల సమయంలో చప్టాలపై నీరు ప్రవహిస్తుండడంతో నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. యేటా ఏదో ఒక తుపాన్ సమయంలో భారీ వర్షాల కారణంగా చప్టాలపై నీరు ప్రవహిస్తుండడంతో తగ్గే వరకు పలు గ్రామాల ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకుపోతున్నారు. పడవల సాయంతో సంబంధిత గ్రామాలకు చేరుకుని సహాయచర్యలు చేపడుతుంటారు. కొన్ని గ్రామాల వద్ద చప్టాలు దాటే సమయంలో మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. వైసీపీ పాలనలో చప్టాలపై హైలెవెల్ వంతెన నిర్మాణం చేపడతామని ప్రజాప్రతినిధులు చెప్పినా.. ఆ తరువాత పట్టించుకోలేదు. వర్షాకాలం సమీపిస్తుండడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

- గూడూరు మండలం వేములపాళెం సమీపంలోని చప్టాపై నీరు ప్రవహిస్తే విందూరు, రామలింగాపురం, చెంబడిపాళెం, సంతదాసుపల్లి, మిటాత్మకూరు తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి.
- చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం సమీపంలోని చప్టాపై నీరు పారిందంటే ఈ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోతుంది. పడవల సాయంలో గ్రామస్థులకు నిత్యావసరాలను అందించాల్సి వస్తోంది.
- వాకాడు మండలం గంగన్నపాళెం సమీపంలోని చప్టాపైకి నీరు పారితే పామంజి, వాలమేడు, జమీన్‌కొత్తపాళెం తదితర 12కు పైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. పంబలి సమీపంలో చప్టాపై నీరు ప్రవహిస్తే కాకివాకం, శ్రీనివాసపురానికి రాకపోకలు నిలిచిపోతాయి.
- కోట మండలం గోవిందపల్లి, గూడలి గ్రామాలకు వెళ్లే చప్టాల పరిస్థితి ఇదేవిధంగా ఉంది.
- చిట్టమూరు మండలం పిట్టివానిపల్లి వద్ద చప్టా జలదిగ్బంధంలో చిక్కుకుంటే నియోజకవర్గంతో సంబంధాలు తెగిపోతాయి.

ఇకనైనా అధికారులు స్పందించి నియోజకవర్గ పరిధిలో భారీ వర్షాల సమయంలో జలదిగ్బంధంలో చిక్కుకుపోతున్న గ్రామాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో చప్టాల స్థానంలో హైలెవెల్ వంతెనలను నిర్మించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామీణులు కోరుతున్నారు.





వేములపాళెం వద్ద, తిప్పగుంటపాళెం చప్టాలపై ఉధృతంగా పారుతున్న నీరు (ఫైల్‌ఫొటోలు)

డక్కిలి ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత

రోగులకు అందని మెరుగైన వైద్యం ● దంత వైద్యుడు ఎప్పుడొస్తారో?

డక్కిలి, జూలై 28: సార్ ! పంటి డాక్టర్ ఎప్పుడొస్తారు... ఎప్పుడు వచ్చినా ఆ తలుపు మూసే ఉంటుంది... అన్న ప్రశ్నలు రోగుల నుంచి వినిపిస్తున్నాయి. రోజూ 100 నుంచి 150 మంది రోగులు ఆసుపత్రికి వస్తున్నా ఒకే నర్సు సేవలందిస్తోంది... ఇంత మంది బాగోగులు ఒకరే చూడాలంటే కాస్తంత చిరాకు ఉంటుంది కదా... అని రోగులే సర్దుకు పోతున్నారు. ఉన్న ఇద్దరు డాక్టర్లలో ఒకరు ఓపీలో రోగులకు వైద్యం అందిస్తుండగా మరొకరు ఫీల్డ్‌కు వెళ్లి వైద్యసేవల్లో నిమగ్నమవుతారు. గతంలో ఐదారుగురు డాక్టర్లు, ఆరేడుగురు నర్సులతో కళకళలాడిన డక్కిలి ప్రభుత్వ ఆసుపత్రిలో నేడు రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదన్న విమర్శలు మూటగట్టుకుంటోంది.





డక్కిలి ప్రభుత్వ ఆసుపత్రి- ఆసుపత్రిలో మూతవేసి వున్న దంత వైద్యుడి గది

డక్కిలిలో 30 పడకల ఆసుపత్రి 1992లో అప్పటి సీఎం ఎన్.జనార్దన రెడ్డి చొరవతో ఏర్పాటైంది. అప్పట్లో తగినంత మంది వైద్యులు, సిబ్బంది ఉండటంతో రోజూ ఓపి 200 నుంచి 300 వరకు ఉండేది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వైద్యులు, సిబ్బందిని బాగా తగ్గించేశారు. ఐదుగురు వైద్యుల స్థానంలో పంటి డాక్టరుతో కలిపి ముగ్గురికి కుదించారు. ఐదుగురు స్టాఫ్‌నర్సులకు గాను ముగ్గురికి చేరింది. వీరు మూడు షిఫ్టుల్లో ఒక్కొరు మాత్రమే విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇక పంటి సమస్యతో ఆసుపత్రికి వచ్చే రోగులకు దంత డాక్టర్ దర్శనమే కరువు అవుతోందని వాపోతున్నారు. ఈయన వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే కనిపిస్తారని రోగులు చెబుతునానరు. ఆ రెండు రోజులు కూడా ఏ రోజు వస్తారో కూడా తెలియడం లేదని వాపోతున్నారు. ఇక రాత్రి వేళల్లో ప్రజలకు వైద్య సేవలు అవసరమైతే ఇక్కడ వైద్యులు అందుబాటులో ఉండరన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక ఈ ఆసుపత్రిలో ఉదయం వైద్య సేవలు కూడా ఆలస్యంగా మొదలవుతాయని రోగులు చెబుతున్నారు. ఇక ఆసుపత్రి డీసీఎస్ (డిప్యూటీసివిల్ సర్జన్)గా పనిచేస్తున్న హరిత అనే సీనియర్ వైద్యు రాలు తిరుపతి డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఆరు నెల క్రితం డిప్యూటేషన్‌పై వెళ్లారు. అక్కడి బాధ్యతలు నిర్వహిస్తునే ఇక్కడి ఆసుపత్రిని పర్యవేక్షించాల్సి ఉంది. అయితే ఆమె గత ఆరు నెలల్లో ఒక్క రోజు కూడా ఈ ఆసుపత్రికి వచ్చినట్టు దాఖలాలు లేవంటున్నారు. డ్రాయింగ్ అధికారిగా కావడంతో ఈ ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది జీతభత్యాల బిల్లుకు ఆమె సంతకం కోసం తిరుపతికి పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం మారినా ఇక్కడి ఆసుపత్రి పరిస్థితి మారలేదని స్థానికులు వాపోతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయ పరిధిలో పనిచేసే ఆరోగ్య సిబ్బందిలో కొందరు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

పల్స్‌పోలియో సిబ్బందికి అందని గౌరవవేతనం!

ఈ ఏడాది మార్చి 3,4,5 తేదీల్లో డక్కిలి మండలంలో పల్స్ పోలియో జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వ్రర్కర్లు, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది కలిసి మొత్తం 244 మంది పనిచేశారు. ఇందుకు గాను వారికి ప్రభుత్వం గౌరవ వేతనం కింద మార్చి నెలలోనే రూ.54,900 మంజూరు చేసింది. అయితే ఈ గౌరవ వేతనం ఇతర మండలాల్లో అప్పుడే అందచేయగా డక్కిలిలో మాత్రం ఇప్పటివరకు అందచేయలేదు. ఇదే విషయమై డీసీఎస్‌ను ఫోన్‌లో వివరణ కోరగా... ఇవ్వాలి... ఇస్తాం... అంటూ సమాధానం చెప్పారు.

మల్లెకు నేరేడుకాయ తెగులు

రాలిపోతున్న మొగ్గలు ● లబోదిబోమంటున్న రైతులు

కోట, జూలై 28: మల్లెసాగుతో కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్న సన్న, చిన్నకారు రైతులకు చేదు అనుభవం ఎదురవుతోంది. సీజన్‌లో అత్యధిక ధరలు పలుకుతున్న నేపథ్యంలో చేతి కొచ్చిన పంటకు నేరేడు కాయ తెగులు ఆశించడంతో కళ్ల ముందే మొగ్గలు రాలి పోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కోట మండలంలోని మెట్ట గ్రామాలైన కొండుగుంట, కేశవరం, రాఘవాపురం, సిద్ధమ్మకండ్రిగ, రామాపురం, మద్దాలి, మద్దాలి కండ్రిగల్లో దశాబ్దాలుగా రైతులు మల్లె తోటలను సాగుచేసి జీవనం సాగిస్తున్నారు. అర ఎకరం నుంచి రెండెకరాల్లో చిట్టి మల్లెలు సాగు చేస్తున్నారు. మల్లెలు విక్రయించి వచ్చిన డబ్బుతోనే కుటుంబాలను పోషించుకుంటున్నారు. అయితే ప్రస్తుత సీజన్‌లో మల్లెలకు డిమాండ్ ఉన్నప్పటికీ నేరుడుకాయ తెగులు సోకడంతో మొగ్గలు ఎర్రగా పాలిపోయి మరకలు ఏర్పడి ఒకట్రెండు రోజుల తరువాత రాలిపోతున్నాయి. ప్రస్తుతం కిలో చిట్టి మల్లెలు రూ. 400 నుంచి రూ.500 వరకు విక్రయమవుతున్నాయి. ధర ఉన్నప్పుడు మొగ్గలు రాలిపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్ మల్లె రైతులకు కంటతడి మిగిల్చింది.





కేశవరంలో సాగులో ఉన్న మల్లెతోట - తెగులు సోకడంతో రాలిపోయిన మొగ్గ

రోటరీ క్లబ్ కార్యవర్గం

సూళ్లూరుపేట, జూలై 28: సూళ్లూరుపేట రోటరీ క్లబ్ 2024-25 కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.సుధాకర్ రెడ్డి, కార్యదర్శిగా కొండా రామకృష్ణ సహా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని పాల్ హ్యారీస్ ఫెలో హాల్‌లో రోటరీ మాజీ జిల్లా గవర్నర్ కె.మునిగిరీష్ ఆధ్వర్యంలో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విచ్చేశారు. ఈ సందర్భంగా తడ మండలం వాటంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది టెన్త్‌లో అధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. రోటేరియన్లు సతీష్, వి.శివకుమార్ రెడ్డి, విజయలక్ష్మి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కించి, ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 84,173 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 32,519 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో అదనపు ఈవో తనిఖీలు



సిబ్బందితో కలిసి తనిఖీల్లో పాల్గొన్న అదనపు ఈవో వెంకయ్య

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదివారం సాయంత్రం తిరుమలలోని పలు ప్రాంతాలను, దర్శన క్యూలైన్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆళ్వార్ ట్యాంక్ అతిథిగృహాల వద్దనున్న ఎస్ఎస్‌డీ క్యూలైన్, టోకెన్ తనిఖీ కేంద్రాలను పరిశీలించారు. తర్వాత వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1, 2లోని కంపార్టుమెంట్లు, సుపథం వద్ద చిన్నపిల్లల తల్లిదండ్రులు, దాతలతో పాటు వివిధ దర్శనాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఎస్ఈడీ క్యూలైన్, ఫొటో క్యాప్చర్ తదితర అంశాలను పరిశీలించారు. అదనపు ఈవోతో పాటు ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవోలు లోకనాథం, ఆశాజ్యోతి, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, వీజీవోలు నందకిషోర్, గిరిధరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జోరుగా సాగుతున్న క్రికెట్ టోర్నీ

చిల్లకూరు, జూలై 28: మండలంలోని మోమిడి గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఉల్లాసంగా సాగాయి. ఉదయం మోమిడి సీ - పునుగుంటపాళెం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన మోమిడి -సీ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన పునుగుంటపాళెం జట్టు 10.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసి విజయం సాధించింది. అల్లీపురం- చిగురుపాడు జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన చిగురుపాడు 9 ఓవర్లలో 10 వికెట్లకు 34 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అల్లీపురం జట్టు 5 ఓవర్లలో 3 వికెట్లకు 35 పరుగులు చేసి విజయం సాధించింది. మధ్యాహ్నం లింగవరం - కొత్తపట్నం జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన కొత్తపట్నం జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లుకు 88 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన లింగవరం 9.5 ఓవర్లలో 5 వికెట్లకు 89 పరుగులు చేసి విజయం సాధించింది. కృష్ణపట్నం- వరగలి మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన వరగలి జట్టు 12 ఓవర్లలో 6 వికెట్లుకు 146 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కృష్ణపట్నం జట్టు 12 ఓవర్లలో 8 వికెట్లు 128 పరుగులు చేసి ఓటమిపాలైంది.

వైసీపీ బురదజల్లేలా వ్యహరిస్తోంది

ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కనీసం గంట కూడా పదవిలో లేకుండా మాజీ సీఎం జగన్ ఉండలేని పరిస్థితిలో ఉన్నారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాలొరెడ్డి అన్నారు. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 36 మంది వైసీపీ నాయకులను హత్య చేశారని జగన్ ఢిల్లీలో ధర్నా చేశారన్నారు. ఎవరు చనిపోయారు, వారి పేర్లు చెబితే విచారణ చేయిస్తామని పలుమార్లు సీఎం చెప్పినా సమాధానం చెప్పలేని పరిస్థితిలో వైసీపీ నాయకులు ఉన్నారన్నారు. కేవలం బురద చల్లేసి కడుక్కోండనే విధంగా జగన్ వ్యవహారం ఉందన్నారు. ప్రభుత్వంలో ఏదైనా లోటుపాట్లు ఉంటే ప్రశ్నించేలా ప్రతిపక్ష పాత్ర పోషించాలని కోరుకుంటున్నామన్నారు. గతంలో తాము కూడా కౌన్సిల్‌లో అనేక ప్రజా సమస్యలపై ప్రశ్నించామన్నారు. గతంలో టీటీడీలో అనేక అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. గతేడాది శ్రీవారి పరకామణిలో వందల కోట్ల కుంభకోణం జరగడం ఇటీవల బయటపడిందన్నారు. కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చ జరిగినప్పుడు మంత్రి ఆనం విచారణ చేయిస్తానని చెప్పారన్నారు.




నేత్ర వైద్య శిబిరానికి స్పందన

కోట, జూలై 28: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం జరిగింది. తిరుపతికి చెందిన ఎస్వీ అరవింద నేత్రాలయ సహకారంతో కంటి వైద్య నిపుణులు గౌతమి, కీర్తి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 60 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మరో 60 మందికి కంటి అద్దాలు, మందులు అందించారు. ట్రస్టీ గౌరీశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాకంబరిగా కన్యకా పరమేశ్వరి దర్శనం

కోట, జూలై 28 : కోట పట్టణంలో కొలువై ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. 40 రకాల కూరగాయాలతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందనా, పుష్పాలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



వేనాడులో గ్రామ దేవతకు అంబళ్లు



అంబళ్లు పోస్తున్న గ్రామస్తులు

తడ, జూలై 28: ఆడిమాసం రెండో వారం కావడంతో మండల పరిధిలోని వేనాడులో ఆదివారం గ్రామస్తులు గ్రామ దేవతకు అంబళ్లు పోసే కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. గ్రామంలో ఇంటిల్లిపాదితో పాటు గ్రామ వీధుల్లో వేపాకు తోరణాలు కట్టి గ్రామ దేవతలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేసి అంబళ్లు పోశారు. అనంతరం గ్రామ దేవతలతో గ్రామ వీధుల్లో మేళ, తాళాలు, తప్పెట్లతో ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ నడిబొడ్డున నైవేద్యం సమర్పించారు. సాయంత్రం గంగమ్మ ఆలయం వద్ద గ్రామస్తులు వడపొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు.

వేమాలమ్మ గ్రామోత్సవం

నాయుడుపేట, జూలై 28: మండలంలోని కూచివాడలో గ్రామ దేవత వేమాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు, సామూహిక పొంగళ్లను పెట్టారు. గ్రామం నుంచి ఇతర పట్టణాల్లో, ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారు ఉన్నారు. వారందరూ వేమాలమ్మ పొంగళ్ల సమయానికి స్వగ్రామానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేమాలమ్మ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల నడుమ గ్రామెత్సవం నిర్వహించారు.



వైభవంగా చండికా పరమేశ్వరి దేవి ఉత్సవాలు

పెళ్లకూరు, జూలై 28: మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెంలో కొలువై ఉన్న చండికా పరమేశ్వరి దేవి ఆలయ ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వారం రోజుల పాటు ఈ ఉత్సవాల్లో అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పలు రకాల పూలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం స్వస్తివాచకం, బింబాభిషేకం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, గోపూజలు నిర్వహించారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూలై 28: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.



దాడిపై కేసు నమోదు

సూళ్లూరుపేట, జూలై 28: పట్టణంలోని కోళ్లమిట్టకు చెందిన సాయిపై అదే ప్రాంతానికి చెందిన గౌతమ్ తన స్నేహితుడితో కలిసి దాడి చేశారు. ఎస్ఐ రహీం రెడ్డి తెలిపిన వివరాలు... కోళ్లమిట్టకు చెందిన ఇద్దరి మధ్య పాత కక్షలున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం గౌతమ్ కోళ్లమిట్ట సమీపంలోని మోర్‌మార్కెట్ వద్ద వెళ్తుండగా సాయి అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో ఆగ్రహించిన గౌతమ్ తన స్నేహితుడు గిరీష్‌తో కలిసి సమీపంలో ఉన్న బిర్యానీ ప్యాలెస్ వద్ద సాయిపై దాడి చేశాడు. స్థానికులు క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ

నాయుడుపేట టౌన్, జూలై 28 : పట్టణంలోని సంజాయ్‌గాంధీ కాలనీలో ఉన్న మేరీ వృద్ధాశ్రమానికి ఇందిరా సిల్క్ యజమాని ఫ్యాన్ సహా నిత్యావసరనిత్యవసర సరుకులను ఆదివారం అందజేశారు. వృద్ధాశ్రమానికి అవసరమగు చేయూతను తాము అందిస్తామని దిలీప్ తెలిపారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, జూలై 28: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్ట్ సహకారంతో 25 మంది పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. వెంకటకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాధమ్మ, ధనుంజయరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.